




# పెన్ పవర్

తెలుగు దిన పత్రిక

ప్రశ్నించడం మన హక్కు








సంపుటి : 1 సంచిక : 237 పేజీలు : 8 సంపాదకులు : జి.ఎ.రావు ( ఆనంద్ గంట్యాడ) పచురణ : తాడేపల్లిగూడెం ఆదివారం 5 జూలై 2026 వెల : 1/-రూ ॥

VOLUME :1 ISSUE : 237 PAGES : 8 EDITOR : G. A. RAO ( ANAND GANTYADA ) PUBLISHED : THADEPALLI GUDEM SUN 5 JULY 2026 PRICE : 1/- RS

Simultaneously Published form : Thadepalligudem, Dr. B.R. Ambedkar Konasema Dist, Narasarao Peta,Bapatla,Visakhapatnam,Kakinada,Ongole, Kadapa,,SPSR Nellore, Circulated by :Srikakulam,manyam,Vizianagaram,East Godavari, Eluru,Guntur, Tirupati,Chittor,Kurnool,Anantapur


## మంత్రి నారా లోకేశ్ కు దక్షిణ కొరియా అధికారిక ఆహ్వానం...

- జూలై 5 నుంచి 11 వరకు కొరియాలో పర్యటన
- ద్వైపాక్షిక సంబంధాలు, పెట్టుబడుల ఆకర్షణే ప్రధాన ఎజెండా
- ఎల్జీ, హ్యోసంగ్ వంటి దిగ్గజ సంస్థలతో కీలక సమావేశాలు
- సీఐఐ భాగస్వామ్య సదస్సు కోసం కొరియాలో ప్రత్యేక రోడ్ షో



పెన్ పవర్ డెస్క్:ఆంధ్రప్రదేశ్ రాష్ట్రానికి పెట్టుబడులను ఆకర్షించే లక్ష్యంతో రాష్ట్ర ఐటీ, విద్యా, ఎలక్ట్రానిక్స్ శాఖల మంత్రి నారా లోకేశ్ దక్షిణ కొరియాలో పర్యటించనున్నారు. ఇరు దేశాల మధ్య ద్వైపాక్షిక సంబంధాలను మరింత బలోపేతం చేసే ఉద్దేశంతో తమ దేశంలో పర్యటించాలని రిపబ్లిక్ ఆఫ్ కొరియా (దక్షిణ కొరియా)

- మిగతా 2లో




## తాడేపల్లి నుంచి ఎంత డబ్బు అందుతోంది?: ప్రకాశ్ రాజ్ పై కందుల దుర్గేశ్ ఫైర్

- రావణ్ కు మద్దతుగా నిలిచిన ప్రకాశ్ రాజ్
- కూటమి ప్రభుత్వంపై విమర్శలు గుప్పిస్తూ వరుస ట్వీట్లు
- రావణ్ తో ఉన్న చీకటి సంబంధాలు ఏమిటో చెప్పాలని డిమాండ్



పెన్ పవర్ డెస్క్:యూట్యూబర్ ప్రశ్న రావణ్ (జోసెఫ్) అరెస్టుల పర్వంపై నటుడు ప్రకాశ్ రాజ్ చేసిన విమర్శలకు ఏపీ పర్యాటక శాఖ మంత్రి కందుల దుర్గేశ్ ఘాటుగా బదులిచ్చారు. ఆంధ్రప్రదేశ్‌లో కావాలనే అశాంతిని, ఘర్షణ వాతావరణాన్ని రగిల్చేందుకు ఒక ముఠా ప్రయత్నిస్తోందని ఆయన

- మిగతా 2లో

## జగన్ హయాంలోనే అన్నీ జరిగితే.. చంద్రబాబు క్రెడిట్ చోరీ ఏంటి?"



- కడప స్టీల్ ప్లాంట్ పెట్టేందుకు జగన్ హయాంలోనే అన్నీ జరిగాయన్న అవినాశ్
- 2022లోనే 1100 ఎకరాల భూసేకరణ జరిగిందని వెల్లడి
- జగన్‌ను దూషించడానికే కడప సభ పెట్టినట్టుందన్న అవినాశ్

పెన్ పవర్ డెస్క్:"కడప స్టీల్ ఫ్యాక్టరీకి సంబంధించి భూసేకరణ, పర్యావరణ అనుమతులు, జీవోల జారీ అంతా జగన్ ముఖ్యమంత్రిగా ఉన్నప్పుడే జరిగితే...

- మిగతా 2లో

## గోదావరి పుష్కరాల ఏర్పాట్లపై మంత్రి నారాయణ సమీక్ష



పెన్ పవర్ డెస్క్: వచ్చే ఏడాది నిర్వహించే గోదావరి పుష్కరాలకు సంబంధించిన ఏర్పాట్లపై తూర్పుగోదావరి జిల్లా అధికారులతో మంత్రి నారాయణ సమీక్షించారు. గోదావరి పుష్కరాల కోసం సీఎం చంద్రబాబు రూ.1500 కోట్లు మంజూరు చేశారని అన్నారు. వీటిలో కేవలం రాజమహేంద్రవరంలో పుష్కరాల కోసమే రూ.580 కోట్ల పనులకు సీఎం అనుమతించారని చెప్పారు.

- మిగతా 2లో



## శతాబ్దపు అతిపెద్ద ఇంధన సంక్షోభాన్ని అధిగమించాం

- 21వ శతాబ్దపు అతిపెద్ద ఇంధన సంక్షోభాన్ని భారత్ విజయవంతంగా అధిగమించిందని వెల్లడి
- పశ్చిమాసియా యుద్ధం వల్ల తలెత్తిన సంక్షోభాన్ని వ్యూహాత్మకంగా ఎదుర్కొన్నామని స్పష్టం
- చమురు రంగ కంపెనీలు రూ. 75,000 కోట్లకు పైగా నష్టాలను భరించాయని వెల్లడి
- ఇంధనం అందించే దేశాల సంఖ్యను 40కి పెంచుకున్నామన్న మోదీ

- మిగతా 2లో

## ఆస్ట్రేలియా వస్తే చంపేస్తాం... ప్రధాని మోదీకి బెదిరింపులు

- ఆస్ట్రేలియా పర్యటనకు ముందు ప్రధాని మోదీకి ఆన్‌లైన్‌లో హత్య బెదిరింపు
- మెల్‌బోర్న్ ఈవెంట్‌కు సంబంధించిన ఫేస్‌బుక్ పోస్ట్ కింద హెచ్చరికతో కూడిన కామెంట్
- రంగంలోకి దిగిన ఆస్ట్రేలియా ఫెడరల్ పోలీసులు.. ఐపీ అడ్రస్ ఆధారంగా దర్యాప్తు
- ప్రధాని పర్యటన షెడ్యూల్‌లో ఎలాంటి మార్పులు లేవని స్పష్టం చేసిన అధికారులు
- భద్రతను కట్టుదిట్టం చేసి, విచారణను అత్యంత ప్రాధాన్యతగా తీసుకున్న పోలీసులు

2లో



## ప్రజా జీవితంలో రేవంత్ రెడ్డి 20 ఏళ్లు.. జడ్పీటీసీ నుంచి సీఎం దాకా!

- 2006లో మిడ్జిల్ జడ్పీటీసీగా రాజకీయ అరంగేట్రం
- తన తొలి గెలుపునకు వేదికైన మిడ్జిల్‌లో కృతజ్ఞతా కార్యక్రమం
- జడ్పీటీసీ నుంచి సీఎం స్థాయికి ఎదిగిన రాజకీయ ప్రయాణం
- ప్రజల ఆకాంక్షల నెరవేర్పుకే కృషి చేస్తానన్న రేవంత్



పెన్ పవర్ డెస్క్: ప్రజా ప్రతినిధిగా తెలంగాణ ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి 20 ఏళ్ల రాజకీయ ప్రస్థానాన్ని పూర్తి చేసుకున్నారు. ఈ చారిత్రక మైలురాయిని పురస్కరించుకుని, తన రాజకీయ జీవితానికి పునాది వేసిన మహబూబ్‌నగర్ జిల్లా మిడ్జిల్ మండలంలో శనివారం

- మిగతా 2లో

## తెలంగాణ... పాక్, శ్రీలంకలా దివాలా తీస్తుంది

### కాంగ్రెస్, బీఆర్ఎస్ పార్టీలపై బండి సంజయ్ ఫైర్



- రాష్ట్రాన్ని బీఆర్ఎస్, కాంగ్రెస్ ప్రభుత్వాలు అప్పుల కుప్పగా మార్చాయన్న సంజయ్
- రూ. 10 లక్షల కోట్ల అప్పుల భారాన్ని ప్రజలపై రుద్దారని మండిపాటు
- రాష్ట్రం అభివృద్ధిపథంలో సాగాలంటే బీజేపీ అధికారంలోకి రావాలని వ్యాఖ్య

పెన్ పవర్ డెస్క్:తెలంగాణను అప్పుల కుప్పగా మార్చడంలో గత బీఆర్ఎస్ ప్రభుత్వానికి, ఇప్పటి కాంగ్రెస్ ప్రభుత్వానికి పెద్ద తేడా లేదు అంటూ కేంద్ర సహాయ మంత్రి బండి సంజయ్ విమర్శలు గుప్పించారు. రాజన్న సిరిసిల్ల జిల్లా వేములవాడ పరిధిలో ఈరోజు పలు


- మిగతా 2లో



## ఎన్నిసార్లు అరెస్ట్ చేస్తారు?: ప్రకాశ్ రాజ్

- పవన్ కల్యాణ్‌పై అనుచిత వ్యాఖ్యలు చేసిన రావణ్ అలియాస్ జోసెఫ్
- కోర్టులు బెయిల్ ఇస్తున్నా ఇతర కేసుల్లో అరెస్ట్ చేస్తున్న పోలీసులు
- కూటమి ప్రభుత్వంపై ప్రకాశ్ రాజ్ విమర్శలు

- మిగతా 2లో



## ఈ నెల 20 నుంచి పార్లమెంట్ వర్షాకాల సమావేశాలు..

### కీలక బిల్లులు, రాజకీయ సమీకరణాలపై ఉత్కంఠ

- జులై 20 నుంచి ఆగస్టు 13 వరకు పార్లమెంట్ వర్షాకాల సమావేశాలు
- మారుతున్న రాజకీయ సమీకరణాల నడుమ జరగనున్న భేటీ
- మహిళా రిజర్వేషన్, ఒకే దేశం ఒకే ఎన్నిక బిల్లులు అజెండాలో ఉండే అవకాశం

- మిగతా 2లో

## ఎడిటర్ వ్యూ

## ప్రజా జీవితంలో రేవంత్ రెడ్డి 20 ఏళ్లు.. జడ్పీటీసీ నుంచి సీఎం దాకా!

- మొదటి పేజి తరువాయి

ఆయన పర్యటించారు. సరిగ్గా రెండు దశాబ్దాల క్రితం, 2006 జులై 4న ఇదే మిడ్జిల్ నుంచి స్వతంత్ర అభ్యర్థిగా జడ్పీటీసీ సభ్యుడిగా విజయం సాధించి రేవంత్ రెడ్డి తన రాజకీయ ప్రయాణానికి శ్రీకారం చుట్టారు.ఎటువంటి రాజకీయ నేపథ్యం లేని సామాన్య కుటుంబం నుంచి వచ్చిన రేవంత్ రెడ్డి, 2007లో స్వతంత్ర అభ్యర్థిగా ఎమ్మెల్సీగా ఎన్నికయ్యారు. అనంతరం తెలుగుదేశం పార్టీలో చేరి 2009, 2014 అసెంబ్లీ ఎన్నికల్లో కొడంగల్ నియోజకవర్గం నుంచి ఎమ్మెల్యేగా గెలుపొందారు. రాష్ట్ర విభజన అనంతరం టీడీపీ తెలంగాణ వర్కింగ్ ప్రెసిడెంట్‌గా బాధ్యతలు నిర్వహించారు. 2017లో కాంగ్రెస్ పార్టీలో చేరిన ఆయన, 2018 ఎన్నికల్లో పరాజయం పాలైనప్పటికీ పట్టువదలకుండా 2019లో మల్కాజ్‌గిరి ఎంపీగా ఘనవిజయం సాధించారు. 2021లో టీపీసీసీ అధ్యక్షుడిగా పగ్గాలు చేపట్టి, 2023 ఎన్నికల్లో కాంగ్రెస్ పార్టీని అధికారంలోకి తీసుకురావడంలో కీలక పాత్ర పోషించి రాష్ట్ర ముఖ్యమంత్రిగా బాధ్యతలు చేపట్టారు.

మిడ్జిల్ పర్యటనలో భాగంగా సీఎం రేవంత్ రెడ్డి ఉర్కొండ ఆలయంలో ప్రత్యేక పూజలు నిర్వహించి, పలు అభివృద్ధి పనులకు భూమి పూజ చేశారు. తన రాజకీయ ప్రస్థానం తొలినాళ్లలో అండగా నిలిచిన మద్దతుదారులు, నాయకులతో కలిసి సహపంక్తి భోజనం చేశారు. అనంతరం జరిగిన బహిరంగ సభలో ప్రసంగిస్తూ తన రెండు దశాబ్దాల ప్రయాణాన్ని గుర్తుచేసుకున్నారు."మిడ్జిల్ రేవంత్ రెడ్డి నుంచి ప్రతి గుండెలో 'రేవంత్ అన్న' వరకు సాగిన ఈ అద్భుత ప్రయాణం నా జీవితంలో ఒక ప్రత్యేక అధ్యాయం" అని ఆయన 'ఎక్స్' వేదికగా భావోద్వేగపూరిత పోస్ట్ చేశారు. ప్రజల ఆకాంక్షలను నెరవేర్చడానికి నిరంతరం కృషి చేస్తానని ఈ సందర్భంగా పునరుద్ఘాటించారు. రాష్ట్ర ఆరోగ్య శాఖ మంత్రి దామోదర రాజనరసింహ సహా పలువురు నేతలు రేవంత్ రెడ్డికి అభినందనలు తెలిపారు. ఒక సాధారణ కార్యకర్త స్థాయి నుంచి రాష్ట్ర ముఖ్యమంత్రిగా ఎదిగిన ఆయన ప్రస్థానానికి ఈ కార్యక్రమం అద్దం పట్టింది.

## మంత్రి నారా లోకేశ్ కు దక్షిణ కొరియా అధికారిక ఆహ్వానం...

- మొదటి పేజి తరువాయి

ప్రభుత్వం ఆయన్ను అధికారికంగా ఆహ్వానించింది. ఈ మేరకు ఆయన జులై 5 నుంచి 11వ తేదీ వరకు కొరియాలో పర్యటించనున్నారు. ఈ పర్యటనలో భాగంగా మంత్రి లోకేశ్.. కొరియాలోని పలు మంత్రిత్వ శాఖల ప్రతినిధులు, పారిశ్రామికవేత్తలతో కీలక సమావేశాల్లో పాల్గొంటారు.ఈ పర్యటన ద్వైపాక్షిక సహకారాన్ని పెంపొందించేందుకు దోహదపడుతుందని చెన్నైలోని దక్షిణ కొరియా కాన్సులేట్ జనరల్ చాంగ్ న్యూన్ కిమ్, మంత్రి లోకేశ్ కు పంపిన ఆహ్వాన లేఖలో పేర్కొన్నారు. భారత్-కొరియా మధ్య సంబంధాలను మరింత పటిష్ఠం చేయడంలో ఈ పర్యటన ఒక కీలక ముందడుగు అవుతుందని ఆయన ఆశాభావం వ్యక్తం చేశారు.

**లోకేశ్ పర్యటన షెడ్యూల్**

జులై 5న సియోల్‌లో ఇండియా డయాస్పోరా ఏర్పాటు చేసే ఆత్మీయ సమావేశానికి హాజరై అక్కడి భారతీయులు, ముఖ్యంగా తెలుగువారిని ఉద్దేశించి ప్రసంగిస్తారు.

జులై 6వ తేదీన దక్షిణ కొరియాకు చెందిన టెక్ స్టార్టప్ సంస్థల ప్రతినిధులతో రౌండ్ టేబుల్ సమావేశంలో పాల్గొని, పెట్టుబడులపై చర్చలు జరుపుతారు. అనంతరం, హ్యోసంగ్ భారీ పరిశ్రమల సంఘం అధ్యక్షుడు టకేషి యొకోటా, సియోల్ సెమీకండక్టర్స్ వైస్ ప్రెసిడెంట్ టేహ్యూంగ్ లీతో లోకేశ్ ప్రత్యేకంగా సమావేశమవుతారు.

జులై 7న ప్రపంచ ప్రఖ్యాత ఎలక్ట్రానిక్స్ దిగ్గజం ఎల్జీ టవర్స్‌లో కీలక సమావేశం జరగనుంది. ఎల్జీ కెమ్ గ్లోబల్ స్ట్రాటజీ సెంటర్ ప్రెసిడెంట్ యున్ జు కోహ్ ఏర్పాటు చేసిన విందు సమావేశంలో లోకేశ్ పాల్గొంటారు. ఈ భేటీకి ఎల్జీ అనుబంధ సంస్థల ఉన్నత స్థాయి ప్రతినిధుల బృందాలు కూడా హాజరుకానున్నాయి.

జులై 8వ తేదీన కొరియన్ మెరైన్ అక్విప్‌మెంట్ అసోసియేషన్ ప్రతినిధులతో భేటీ ఉంటుంది.జులై 9న కొరియన్ పొలిటికల్ అఫైర్స్, ఇంటర్నేషనల్ ట్రేడ్ & ఇన్వెస్ట్‌మెంట్స్ విభాగాల డిప్యూటీ మంత్రులతో వేర్వేరుగా భేటీ అవుతారు.జులై 10వ తేదీన వివిధ సంస్థల ప్రతినిధులతో పెట్టుబడుల గురించి చర్చించడంతో పాటు, కొరియా ఆటో ఇండస్ట్రీ కోఆపరేషన్ ఏజెన్సీ ప్రతినిధులతో రౌండ్ టేబుల్ సమావేశానికి హాజరవుతారు.

అదే రోజు రాత్రి, విశాఖలో జరగనున్న సీఐఐ పార్టనర్‌షిప్ సమ్మిట్-2026ను విజయవంతం చేయాలని కోరుతూ కొరియా కంపెనీల ప్రతినిధులతో నిర్వహించే ప్రత్యేక రోడ్ షోలో పాల్గొంటారు. 11వ తేదీన దక్షిణ కొరియా నుంచి తిరిగి రానున్నారు. ఈ పర్యటన ద్వారా ఏపీకి భారీగా పెట్టుబడులు వస్తాయని ప్రభుత్వం ఆశిస్తోంది.

## తాడేపల్లి నుంచి ఎంత డబ్బు అందుతోంది?: ప్రకాశ్ రాజ్ పై కందుల దుర్గేశ్ ఫైర్

- మొదటి పేజి తరువాయి

ఆరోపించారు. మీడియా ముఖంగా ప్రకాశ్ రాజ్, రావణ్‌లపై విరుచుకుపడిన మంత్రి... వారిద్దరినీ సమాజ విద్రోహ శక్తులుగా అభివర్ణించారు. అసలు ఈ వివాదాస్పద యూట్యూబర్‌తో ప్రకాశ్ రాజ్‌కు ఉన్న చీకటి సంబంధాలేంటో చెప్పాలని డిమాండ్ చేశారు.గత వైసీపీ ప్రభుత్వ హయాంలో రాష్ట్రంలో ఎన్నో అకృత్యాలు సాగాయని, హిందూ దేవాలయాలపై దాడులు జరిగాయని.. అప్పుడు లేవని ప్రకాశ్ రాజ్ గొంతు ఇప్పుడు ఎందుకు లేస్తోందని మంత్రి కందుల దుర్గేశ్ నిలదీశారు. "నాడు మూగనోము నోమిన మీరు.. నేడు కూటమి ప్రభుత్వంపై విషం చిమ్మడానికి తాడేపల్లి ప్యాలెస్ నుంచి ప్రతి నెలా ఎంత డబ్బు అందుకుంటున్నారు?" అంటూ నేరుగా ప్రశ్నించారు. కేవలం రాజకీయ ప్రయోజనాల కోసం, రాష్ట్రంలో అశాంతిని రేకెత్తించి శాంతిభద్రతలను దెబ్బతీయడానికే ఇలాంటి శక్తులు కుట్రలు పన్నుతున్నాయని, వీటిని ప్రభుత్వం కఠినంగా అణచివేస్తుందని మంత్రి హెచ్చరించారు.

## జగన్ హయాంలోనే అన్నీ జరిగితే.. చంద్రబాబు క్రెడిట్ చోరీ ఏంటి?"

- మొదటి పేజి తరువాయి

ఇప్పుడు సీఎం చంద్రబాబు ఆ క్రెడిట్ నాదే అని చెప్పుకోవడం హాస్యాస్పదం" అని వైసీపీ ఎంపీ వైఎస్ అవినాశ్ రెడ్డి విమర్శించారు. శనివారం కడపలో ఏర్పాటు చేసిన మీడియా సమావేశంలో ఆయన మాట్లాడుతూ... కూటమి ప్రభుత్వం పాత ప్రాజెక్టులపై 'క్రెడిట్ చోరీ'కి పాల్పడుతోందని మండిపడ్డారు.2019లోనే జేఎస్‌డబ్ల్యూ సంస్థను కడపలో స్టీల్ ప్లాంట్ పెట్టేందుకు జగన్ ప్రభుత్వం ఒప్పించిందని అన్నారు. ఆ తర్వాత 2022లో ఫ్యాక్టరీ నిర్మాణానికి అవసరమైన అధికారిక జీవోలను జారీ చేయడంతో పాటు, ఫేజ్-1 కింద 1100 ఎకరాల భూసేకరణను కూడా పూర్తి చేసిందన్నారు. 2023 ఫిబ్రవరిలో అప్పటి సీఎం జగన్ స్వయంగా ఈ ప్లాంట్‌కు శంకుస్థాపన చేశారని తెలిపారు. పర్యావరణ అనుమతులు సహా అన్ని క్లియరెన్సులు తమ ప్రభుత్వమే తెచ్చిందని.. ఈ విషయాన్ని జేఎస్‌డబ్ల్యూ అధినేత సజ్జన్ జిందాల్ స్వయంగా ప్రకటించారని తెలిపారు. తాజాగా కడప సభలో చంద్రబాబు చేసిన వ్యాఖ్యలను తప్పుబడుతూ.. ఆ సభ స్టీల్ ఫ్యాక్టరీ అభివృద్ధి కోసం కాకుండా, కేవలం జగన్‌ను దూషించడానికే పెట్టినట్లు ఉందని ఎద్దేవా చేశారు.

ఇదే క్రమంలో అమరావతి రాజధానిపైనా అవినాశ్ రెడ్డి సంచలన వ్యాఖ్యలు చేశారు. అమరావతి అనేది రాష్ట్ర ప్రజలందరి రాజధాని కాదని, అది కేవలం ఒక వర్గానికి చెందిన రాజధానిగా మారిందని ఆరోపించారు. ఈ విషయాన్ని స్వయంగా డిప్యూటీ సీఎం పవన్ కల్యాణ్ కూడా గతంలో అంగీకరించారని అన్నారు. నాడు శివరామకృష్ణ కమిటీ ఇచ్చిన శాస్త్రీయ సూచనలను తుంగలో తొక్కిన చంద్రబాబు... ఇప్పుడు అమరావతి కోసం ఏకంగా రూ.2 లక్షల కోట్ల ప్రజాధనాన్ని వృథాగా ఖర్చు చేయాలని చూస్తున్నారన్నారు. దీనికి ప్రత్యామ్నాయంగా జగన్... మచిలీపట్నం, విజయవాడ, గుంటూరు ప్రాంతాలను అనుసంధానిస్తూ, రాష్ట్ర సమగ్రాభివృద్ధికి ఉపయోగపడే ఆచరణాత్మకమైన 'మావిగన్' నమూనాను ప్రతిపాదించారని చెప్పారు.

# కుప్పంలోనూ బంగారం నిక్షేపాలు ఉన్నాయంటున్నారు... వెలికితీస్తాం

తన సొంత నియోజకవర్గమైన కుప్పాన్ని ఒక అభివృద్ధి కేంద్రంగా, దేశానికే ఆదర్శంగా నిలిపే 'స్వర్ణ కుప్పం' నిర్మాణానికి నాంది పలుకుతున్నట్లు ముఖ్యమంత్రి చంద్రబాబు ప్రకటించారు. కుప్పం పర్యటనలో భాగంగా... రూ.118 కోట్ల వ్యయంతో నిర్మించనున్న అత్యాధునిక ఆర్టీసీ బస్ స్టేషన్, డిపో పనులకు ఆయన శంకుస్థాపన చేశారు. అనంతరం ఏర్పాటు చేసిన భారీ బహిరంగ సభలో ప్రసంగించిన చంద్రబాబు, అభివృద్ధి ప్రణాళికలను వివరిస్తూనే గత ప్రభుత్వంపై తీవ్ర స్థాయిలో విమర్శనాస్త్రాలు సంధించారు.

**కుప్పంలోనూ బంగారు గనులు**

కర్నూలు జిల్లా జొన్నగిరిలో గోల్డ్ ఫీల్డ్స్ ప్రారంభించామని తెలిపారు. ఇప్పుడు కుప్పం ప్రాంతంలోనూ బంగారు గనులు ఉన్నాయని నిపుణులు చెబుతున్నారని చంద్రబాబు సంచలన విషయం వెల్లడించారు. ఆధునిక సాంకేతిక పరిజ్ఞానాన్ని ఉపయోగించి ఆ బంగారు నిక్షేపాలను వెలికితీసి, 'స్వర్ణ కుప్పం' ఆవిష్కరణకు నిజమైన అర్థం కల్పిస్తామని ప్రకటించారు.

మైక్రో ఇరిగేషన్‌లో దేశానికే ఆదర్శంగా నిలిచిన కుప్పం మోడల్‌ను రాష్ట్రవ్యాప్తంగా అమలు చేస్తామన్నారు. హంద్రీ-నీవా జలాలతో 110 చెరువులు నింపామని గుర్తుచేశారు. రాయలసీమను ఉద్యాన హబ్?గా మార్చే 'పూర్వోదయ' ప్రాజెక్టుకు వచ్చే నెల మదనపల్లెలో శంకుస్థాపన చేస్తామని తెలిపారు.

**ఉద్యోగాల కేంద్రంగా కుప్పం**

ఒకప్పుడు ఎన్టీఆర్ హయాంలో కుప్పంలో బస్ స్టేషన్‌కు శంకుస్థాపన జరిగిందని, ఇప్పుడు అదే స్థానంలో సౌర విద్యుత్ వంటి ఆధునిక సదుపాయాలతో మోడల్ బస్ స్టేషన్, డిపో నిర్మాణానికి శ్రీకారం చుట్టామని చంద్రబాబు తెలిపారు. కుప్పాన్ని స్వర్ణ కుప్పంగా మార్చే క్రమంలో పరిశ్రమల స్థాపనకు పెద్దపీట వేస్తున్నామన్నారు. "ఉద్యోగాల కోసం కుప్పం యువత బయటకు వెళ్లడం కాదు, ఇతర ప్రాంతాల వారు ఉద్యోగాల కోసం కుప్పానికి వచ్చే పరిస్థితి కల్పిస్తాం" అని ఆయన ఉద్ఘాటించారు. ఒక్క రోజులోనే రూ.9,322 కోట్ల పెట్టుబడులతో 30 ప్రాజెక్టులకు శంకుస్థాపనలు, ప్రారంభోత్సవాలు, ఒప్పందాలు జరిగాయని, వీటి ద్వారా సుమారు 80 వేల మందికి ఉపాధి లభిస్తుందని వివరించారు. ప్రఖ్యాత అడిడాస్ ఫుట్‌వేర్ సంస్థతో పాటు టూ సీటర్ ట్రైనీ ఎయిర్‌క్రాఫ్ట్ తయారీ, డెయిరీ, ఫుడ్ ప్రాసెసింగ్ పరిశ్రమలు కుప్పానికి వస్తున్నాయని వెల్లడించారు.

**కాలుష్య రహిత, సుస్థిర అభివృద్ధి**

ఎస్సీ, ఎస్టీలకు సోలార్ రూఫ్‌టాప్ ద్వారా ఉచిత విద్యుత్, బీసీ, ఓసీలకు రూ.552 కోట్లతో సౌర విద్యుత్ సదుపాయం కల్పిస్తామని చెప్పారు. 'నెట్ జీరో' విధానంలో భాగంగా ఇళ్లపైనే కూరగాయలు పండించుకోవడం, ఈ-సైకిళ్ల వాడకం పెంచి కుప్పాన్ని కాలుష్య రహిత నగరంగా తీర్చిదిద్దాలని పిలుపునిచ్చారు. కుప్పంలోని బ్లూ గ్రానైట్‌కు ప్రపంచవ్యాప్తంగా ఉన్న డిమాండ్‌ను దృష్టిలో ఉంచుకొని 'హెరిటేజ్ గ్రానైట్ క్లస్టర్' ఏర్పాటు చేస్తున్నట్లు ప్రకటించారు.

**గత పాలనపై తీవ్ర విమర్శలు**

గత ఐదేళ్లలో వైసీపీ ప్రభుత్వం కుప్పంపై కక్ష కట్టిందని, అభివృద్ధిని అడ్డుకుందని చంద్రబాబు ఆరోపించారు. "నీళ్లు తెచ్చామని సినిమా సెట్టింగులు వేసి డ్రామాలు ఆడారు. 2019-24 మధ్య నన్ను నా నియోజకవర్గంలోనే తిరగనివ్వకుండా అడ్డంకులు సృష్టించారు. నాకు సహకరించిన వారిని వేధించారు" అని మండిపడ్డారు. రాయలసీమలో ఫ్యాక్షన్ రాజకీయాలకు కాలం చెల్లిందని, ఇప్పుడు అభివృద్ధే తమ అజెండా అని స్పష్టం చేశారు. సంఘ విద్రోహ శక్తుల పట్ల కఠినంగా వ్యవహరిస్తానని హెచ్చరించారు. వివేకానందరెడ్డి హత్య, కోడికత్తి డ్రామా, డాక్టర్ సుధాకర్, డ్రైవర్ సుబ్రహ్మణ్యం ఘటనలను ప్రస్తావిస్తూ గత ప్రభుత్వంలో జరిగిన అరాచకాలను ఎండగట్టారు.

**'మావిగన్' అంటూ గొడ్డలి పార్టీ వింత వాదన**

రాజధానిపై గత ప్రభుత్వం రోజుకో మాట మాట్లాడిందని విమర్శించారు. ప్రజలందరూ అమరావతినే రాజధానిగా కోరుకుంటుంటే, 'గొడ్డలి పార్టీ' మాత్రం వాటికన్ తరహాలో 'మావిగన్' కావాలంటోందని ఎద్దేవా చేశారు. గొడ్డలి పార్టీ అని తాము అనడం కాదని, వారే అంగీకరిస్తున్నారని వ్యాఖ్యానించారు.

కుప్పం అభివృద్ధికి సుర్బానా జురాంగ్, ఐఐటీ కాన్పూర్ వంటి సంస్థల సహకారంతో మాస్టర్ ప్లాన్ సిద్ధం చేస్తున్నామని తెలిపారు. పర్యాటకాన్ని ప్రోత్సహించేందుకు ఎలిఫెంట్ సఫారీ, రాక్ క్లైంబింగ్ వంటి ప్రాజెక్టులను అభివృద్ధి చేస్తామన్నారు. ప్రజా భాగస్వామ్యంతో కుప్పాన్ని దేశంలోనే ఒక ఆదర్శ నియోజకవర్గంగా తీర్చిదిద్దుతానని చంద్రబాబు పునరుద్ఘాటించారు. ఈ కార్యక్రమంలో మంత్రి మండిపల్లి రామ్ ప్రసాద్ రెడ్డి, ఎంపీ దగ్గుమళ్ల ప్రసాదరావు, ఆర్టీసీ వైస్ ఛైర్మన్ మునిరత్నం, ఇతర ప్రజాప్రతినిధులు, అధికారులు పాల్గొన్నారు.

## శతాబ్దపు అతిపెద్ద ఇంధన సంక్షోభాన్ని అధిగమించాం

పశ్చిమాసియా యుద్ధం కారణంగా తలెత్తిన 21వ శతాబ్దపు అతిపెద్ద ఇంధన సంక్షోభాన్ని భారత్ విజయవంతంగా అధిగమించిందని ప్రధాని నరేంద్ర మోదీ ప్రకటించారు. సరైన సమయంలో తీసుకున్న విధానపరమైన నిర్ణయాలు, వ్యూహాత్మక ప్రణాళికలు మరియు పటిష్ఠమైన దౌత్యం వల్లనే ఇది సాధ్యమైందని ఆయన స్పష్టం చేశారు. శనివారం రాజస్థాన్‌లోని బలోత్రా జిల్లాలో ఒక భారీ ఆయిల్ రిఫైనరీ ప్రాజెక్టును ప్రారంభించిన అనంతరం నిర్వహించిన బహిరంగ సభలో ఆయన ప్రసంగించారు."నవ భారత సంకల్పం, కృషితో 21వ శతాబ్దపు అతిపెద్ద ఇంధన సంక్షోభాన్ని మనం అధిగమించాం" అని ప్రధాని మోదీ పేర్కొన్నారు. పశ్చిమాసియా యుద్ధం కారణంగా హర్మూజ్ జలసంధి వంటి కీలక సముద్ర మార్గాల్లో ఇంధన సరఫరాకు తీవ్ర విఘాతం ఏర్పడిన విషయాన్ని ఆయన ఈ సందర్భంగా గుర్తుచేశారు. ఇటువంటి క్లిష్ట పరిస్థితుల్లో సంక్షోభాన్ని ముందుగానే అంచనా వేసి, జాతీయ వనరులను సద్వినియోగం చేసుకోవడంతో పాటు, దౌత్య సంబంధాల ద్వారా చమురు సరఫరాకు ఆటంకం కలగకుండా చర్యలు తీసుకున్నామని వెల్లడించారు.ఇంధన సంక్షోభం తలెత్తిన సమయంలో

వినియోగదారులపై ఆర్థిక భారం పడకుండా ప్రభుత్వ రంగ చమురు సంస్థలు రూ. 75,000 కోట్లకు పైగా నష్టాలను భరించాయని, ప్రభుత్వం వారికి పూర్తి అండగా నిలిచిందని ప్రధాని వివరించారు. దౌత్యపరమైన చొరవతో, మనకు ఇంధనం అందించే దేశాల సంఖ్యను 25 నుంచి 40కి పెంచుకున్నామని, దీనివల్ల దేశంలో ఎక్కడా కొరత ఏర్పడకుండా చూడగలిగామని తెలిపారు. కొందరు ప్రతిపక్ష నేతలు ప్రజల్లో భయాందోళనలు సృష్టించే ప్రయత్నం చేసినప్పటికీ, ప్రభుత్వం తెరవెనుక చేసిన కృషి చరిత్రాత్మకమని వ్యాఖ్యానించారు. ఈ విజయం 'ఆత్మనిర్భర్ భారత్' స్ఫూర్తికి నిదర్శనమని ఆయన కొనియాడారు.

## ఎన్నిసార్లు అరెస్ట్ చేస్తారు?: ప్రకాశ్ రాజ్

డిప్యూటీ సీఎం పవన్ కల్యాణ్‌పై అనుచిత వ్యాఖ్యలు చేసిన యూట్యూబర్ ప్రశ్న రావణ్ (బచ్చలకూరి జోసెఫ్)పై ఏపీలో పలు కేసులు నమోదైన సంగతి తెలిసిందే. బెయిల్ పై అతడు బయటకు వస్తున్నప్పటికీ... ఇప్పటికే నమోదైన ఇతర కేసుల్లో మళ్లీ పోలీసులు అరెస్ట్ చేస్తున్నారు. దీనిపై సినీ నటుడు ప్రకాశ్ రాజ్ విమర్శలు గుప్పించారు. ముఖ్యమంత్రి, డిప్యూటీ సీఎం పవన్ కల్యాణ్‌లను ట్యాగ్ చేస్తూ ఆయన విమర్శనాత్మకంగా ట్వీట్ చేశారు."అరెస్ట్.. బెయిల్.. అరెస్ట్.. బెయిల్.. అరెస్ట్.. బెయిల్.. మళ్లీ అరెస్ట్. మీరు తప్పు చేస్తున్నారని మీకు కోర్టులు స్పష్టంగా చెప్పడం లేదా? మీ కక్షపూరిత రాజకీయాలను ప్రజలు గమనిస్తున్నారు" అంటూ ప్రకాశ్ రాజ్ విమర్శలు గుప్పించారు. "ప్రశ్నించే వారిని అధికారాన్ని దుర్వినియోగం చేసి అణచివేయడం ఎంతవరకు సాగుతుంది? కోర్టు బెయిల్ ఇచ్చిన వెంటనే మరో కేసు తెరిచి వేధించడం సిగ్గుచేటు" అని మండిపడ్డారు. రావణ్ ఏలూరులో పవన్ కల్యాణ్‌పై చేసిన వ్యాఖ్యలు వైరల్ అయిన తర్వాత పిఠాపురం పోలీసులు అతన్ని అరెస్టు చేశారు.

కాకినాడ కోర్టు బెయిల్ మంజూరు చేయగా, వెంటనే సర్పవరం పోలీసులు మరో పాత కేసులో అతన్ని అదుపులోకి తీసుకున్నారు. రావణ్‌పై మొత్తం 30 కేసులు ఉన్నాయని, ఇది స్పష్టమైన ప్రతీకార చర్య అని ప్రకాశ్ రాజ్ ఆరోపించారు. జనసేన కార్యకర్తలు పోలీస్ వాహనాన్ని అడ్డుకున్న ఘటనను కూడా ఆయన ప్రస్తావిస్తూ... ప్రశ్నిస్తే చంపేస్తారా? అని ప్రశ్నించారు.

## ఆస్ట్రేలియా వస్తే చంపేస్తాం... ప్రధాని మోదీకి బెదిరింపులు

భారత ప్రధాని నరేంద్ర మోదీ ఆస్ట్రేలియా పర్యటనకు కొద్ది రోజుల ముందు ఆన్‌లైన్‌లో హత్య బెదిరింపు రావడం కలకలం రేపింది. ఈ ఘటనపై ఆస్ట్రేలియా ఫెడరల్ పోలీసులు (ఏఎఫ్‌పీ) కేసు నమోదు చేసి దర్యాప్తు ప్రారంభించారు. ప్రధాని మోదీ పర్యటనను, ప్రవాస భారతీయులతో జరగనున్న భారీ కార్యక్రమాన్ని లక్ష్యంగా చేసుకుని ఈ బెదిరింపు వెలువడింది. వివరాల్లోకి వెళితే, ప్రధాని మోదీ జూలై 9న మెల్‌బోర్న్‌లోని మార్వెల్ స్టేడియంలో 'మెల్‌బోర్న్ మీట్స్ మోదీ' అనే కార్యక్రమంలో పాల్గొననున్నారు. ఈ కార్యక్రమ ప్రచారంలో భాగంగా ఫేస్‌బుక్‌లో పెట్టిన ఒక పోస్ట్ కింద 'అబు ముస్తఫా' అనే ఖాతా నుంచి బెదిరింపు కామెంట్ వచ్చింది. "ఈవెంట్ సమయంలో స్టేడియం పైకప్పులు మూసి ఉంచడం మంచిది. లేదంటే, ఆయన తన చావు కోసమే ఆస్ట్రేలియాకు వస్తున్నట్లు అవుతుంది" అని ఆ కామెంట్‌లో పేర్కొన్నారు.ఈ విషయం జూలై 3న ఆస్ట్రేలియా ఫెడరల్ పోలీసుల దృష్టికి వెళ్ళింది. వెంటనే రంగంలోకి దిగిన దర్యాప్తు అధికారులు, బెదిరింపు పోస్ట్ చేసిన ఖాతాకు సంబంధించిన ఐపీ అడ్రస్‌ను గుర్తించినట్లు సమాచారం. అయితే, దర్యాప్తు కొనసాగుతున్నందున ఈ విషయంపై పూర్తి వివరాలు వెల్లడించడానికి ఏఎఫ్‌పీ నిరాకరించింది.

ఇప్పటివరకు ఎవరినీ అరెస్ట్ చేసినట్లు ప్రకటించలేదు.ఆస్ట్రేలియా-భారత్ వార్షిక నాయకత్వ సదస్సు కోసం ప్రధాని మోదీ జూలై 8 నుంచి 10 వరకు ఆస్ట్రేలియాలో పర్యటించనున్నారు. ఈ పర్యటనలో భాగంగా ఆస్ట్రేలియా ప్రధాని ఆంథోనీ అల్బనీస్‌తో రక్షణ, భద్రత, వాణిజ్యం వంటి కీలక అంశాలపై ద్వైపాక్షిక చర్చలు జరుపుతారు. ఈ బెదిరింపు నేపథ్యంలో ఆస్ట్రేలియా భద్రతా ఏజెన్సీలు అప్రమత్తమయ్యాయి. ప్రధాని మోదీ పర్యటనకు పటిష్టమైన భద్రతా ఏర్పాట్లు చేస్తున్నామని, ఆయన పర్యటన షెడ్యూల్‌లో ఎలాంటి మార్పులు ఉండబోవని అధికారులు స్పష్టం చేశారు.

## తెలంగాణ... పాక్, శ్రీలంకలా దివాలా తీస్తుంది

- మొదటి పేజి తరువాయి

అధికారిక కార్యక్రమాల్లో పాల్గొన్న ఆయన.. అనంతరం మీడియాతో మాట్లాడుతూ కాంగ్రెస్, బీఆర్ఎస్ పార్టీలపై మండిపడ్డారు.రాష్ట్ర ఖజానాను లూటీ చేస్తూ ఏకంగా రూ.10 లక్షల కోట్ల మేర అప్పుల భారాన్ని సామాన్యుడి నెత్తిన రుద్దారని దుయ్యబట్టారు. ఈ తరహా బాధ్యతారాహిత్యమైన ధోరణి ఇలాగే కొనసాగితే... భవిష్యత్తులో మన రాష్ట్రం కూడా పాకిస్థాన్, శ్రీలంకల మాదిరి దివాలా తీసే దుస్థితికి చేరుకుంటుందని హెచ్చరించారు. ఈ సంక్షోభం నుంచి గట్టెక్కి ప్రగతిపథంలో పయనించాలంటే రాష్ట్రంలో బీజేపీ అధికారంలోకి రావడం ఒక్కటే మార్గమని ఆయన స్పష్టం చేశారు. తెలంగాణలో కొనసాగుతున్న ప్రతి చిన్న అభివృద్ధి వెనుక మోదీ సర్కార్ పంపిన నిధులే ఉన్నాయని గుర్తుచేశారు.పల్లెల ప్రగతి కోసం ఢిల్లీ నుంచి నేరుగా వస్తున్న ఆర్థిక సంఘం నిధులను సైతం ఇక్కడి

పాలకులు జీతాల చెల్లింపుల కోసం దారిమళ్లిస్తున్నారని సంజయ్ ఆరోపించారు. కేంద్రం ప్రవేశపెట్టిన ప్రజాహిత పథకాలపై కోర్టులకెళ్లడం ఏంటని ప్రశ్నించిన ఆయన... వీబీ జీ రామ్ జీ పథకం ద్వారా ఉపాధి కల్పించి శాశ్వత సంపదను సృష్టిస్తుంటే... దానిపై కూడా రాజకీయం చేస్తున్నారని మండిపడ్డారు. ప్రధాని మోదీకి దక్కుతున్న ఆదరణను తట్టుకోలేకనే ప్రతిపక్షాలు ఈర్ష్యతో ఇటువంటి దిగజారుడు చర్యలకు పాల్పడుతున్నాయని, కానీ ప్రజలు అన్నింటినీ గమనిస్తున్నారని అన్నారు.

## ఈ నెల 20 నుంచి పార్లమెంట్ వర్షాకాల సమావేశాలు..

పార్లమెంట్ వర్షాకాల సమావేశాలకు ముహూర్తం ఖరారైంది. జులై 20వ తేదీ నుంచి ఆగస్టు 13వ తేదీ వరకు ఈ సమావేశాలు జరగనున్నాయని కేంద్ర పార్లమెంటరీ వ్యవహారాల శాఖ మంత్రి కిరణ్ రిజిజు ప్రకటించారు. జాతీయ ప్రాధాన్యత కలిగిన అంశాలపై అర్థవంతమైన చర్చలు, నిర్ణయాలు తీసుకోవడమే లక్ష్యంగా ఈ సమావేశాలు జరుగుతాయని ఆయన తన 'ఎక్స్' ఖాతాలో పేర్కొన్నారు. కేంద్ర ప్రభుత్వ సిఫార్సు మేరకు రాష్ట్రపతి ద్రౌపది ముర్ము పార్లమెంట్ ఉభయ సభలను సమావేశపరచడానికి ఆమోదం తెలిపారని రిజిజు వివరించారు. మొత్తం నాలుగు వారాల పాటు జరిగే ఈ సెషన్‌లో 19 రోజుల పాటు సభా కార్యకలాపాలు జరగనున్నాయి.ఈసారి వర్షాకాల సమావేశాలు మారుతున్న రాజకీయ సమీకరణాల నేపథ్యంలో వాడీవేడిగా జరిగే అవకాశం కనిపిస్తోంది. ముఖ్యంగా ప్రతిపక్ష కూటమిలో నెలకొన్న విభేదాలు, అధికార ఎన్డీయే బలాన్ని పెంచే పరిణామాలు ఈ సెషన్‌పై ప్రభావం చూపనున్నాయి. తృణమూల్ కాంగ్రెస్‌కు చెందిన 20 మంది రెబల్ ఎంపీలు ఎన్సీపీఐలో విలీనం కావడం, ఉద్ధవ్ థాకరే వర్గానికి చెందిన ఆరుగురు ఎంపీలు ఏక్‌నాథ్ షిండే నేతృత్వంలోని శివసేనలో చేరడం వంటి అంశాలపై లోక్‌సభ స్పీకర్ ఓం బిర్లా నిర్ణయం తీసుకోనున్నారు. ఈ పరిణామాలతో పార్లమెంటులో ఎన్డీయే బలం మరింత పెరగనుండగా, విపక్ష 'ఇండియా' కూటమి బలహీనపడనుందని అంచనాలు వెలువడుతున్నాయి.మరోవైపు తమిళనాడులో కాంగ్రెస్ పార్టీ టీవీకేతో పొత్తు పెట్టుకోవడంతో డీఎంకే తీవ్ర అసంతృప్తితో ఉంది. ఈ నేపథ్యంలో తమ ఎంపీలకు కాంగ్రెస్ సభ్యులతో సంబంధం లేకుండా ప్రత్యేక సీటింగ్ ఏర్పాట్లు చేయాలని కోరుతూ డీఎంకే ఇప్పటికే స్పీకర్‌కు లేఖ రాసింది. ఈ పరిణామాలన్నీ సభలో ప్రతిపక్షాల ఐక్యతపై ప్రశ్నలు రేకెత్తిస్తున్నాయి.

**ప్రభుత్వ అజెండాలో కీలక బిల్లులు**

ఈ సమావేశాల్లో పలు కీలక బిల్లులను ప్రవేశపెట్టేందుకు కేంద్ర ప్రభుత్వం సిద్ధమవుతోంది. గత సమావేశాల్లో తిరస్కరణకు గురైన మహిళా రిజర్వేషన్, డీలిమిటేషన్‌కు సంబంధించిన 131వ రాజ్యాంగ సవరణ బిల్లుకు ఈసారి ప్రభుత్వం అధిక ప్రాధాన్యత ఇచ్చే అవకాశం ఉంది. దీంతో పాటు తీవ్రమైన నేరాలకు సంబంధించిన కేసుల్లో ప్రధానమంత్రి, ముఖ్యమంత్రులు, మంత్రులు వరుసగా 30 రోజులకు మించి జ్యుడీషియల్ కస్టడీలో ఉంటే వారి పదవులు వాటంతట అవే రద్దయ్యేలా నిబంధనలు తీసుకొచ్చే 130వ రాజ్యాంగ సవరణ బిల్లును ప్రవేశపెట్టాలని ప్రభుత్వం భావిస్తోంది.

అలాగే, దేశవ్యాప్తంగా తీవ్ర చర్చనీయాంశంగా మారిన 'ఒకే దేశం - ఒకే ఎన్నిక' బిల్లు కూడా కేంద్రం అజెండాలో ఉండే అవకాశం ఉంది. వీటితో పాటు విదేశీ విరాళాల నియంత్రణ (ఎఫ్‌సీఆర్ఏ) సవరణ బిల్లు, వికసిత్ భారత్ శిక్షా అధిష్ఠాన్ బిల్లు, యాంటీ-డోపింగ్ బిల్లులను కూడా సభ ముందుకు తీసుకురావడానికి రంగం సిద్ధమైంది.

సుప్రీంకోర్టు న్యాయమూర్తుల సంఖ్యను పెంచే ఆర్డినెన్స్ స్థానంలో కొత్త బిల్లుతో పాటు వేతన నియమావళి, కార్పొరేట్ లా, సెక్యూరిటీస్ మార్కెట్ కోడ్‌లకు సంబంధించిన ప్రతిపాదనలను కూడా ప్రభుత్వం ప్రవేశపెట్టే సూచనలు కనిపిస్తున్నాయి. ఈ నేపథ్యంలో వర్షాకాల సమావేశాలు చట్ట సభల్లో అధికార, ప్రతిపక్షాల మధ్య తీవ్ర ఘర్షణ వాతావరణానికి దారితీయవచ్చని రాజకీయ విశ్లేషకులు భావిస్తున్నారు.

## గోదావరి పుష్కరాల ఏర్పాట్లపై మంత్రి నారాయణ సమీక్ష

- మొదటి పేజి తరువాయి

'పుష్కరాలకు రాజమహేంద్రవరంలో కల్పించాల్సిన సదుపాయాలపై చర్చించాం. పనులు వెంటనే ప్రారంభించాలన్న సీఎం ఆదేశాల మేరకు చేపట్టాల్సిన పనులు నిర్ణయించాం. ప్రస్తుత నిధులతో తొలిదశ పనులు ప్రారంభిస్తున్నాం. రాజమహేంద్రవరంలో మురుగు నీటి శుద్ధి కేంద్రాలను నిర్మిస్తాం. గోదావరిలో మురుగు నీరు కలవకుండా చర్యలు తీసుకుంటాం. రాజమహేంద్రవరంలో డ్రైనేజీ కాల్వల నిర్మాణం కోసం రూ.140కోట్లతో పనులు ప్రారంభిస్తాం.. రోడ్ల నిర్మాణం, విస్తరణ, లైటింగ్ పనులు చేపడతాం. టీడీఆర్ బాండ్లు జారీ చేసి, నగరంలో రోడ్ల విస్తరణ త్వరలో చేపడతాం. గోదావరి కాలుష్య నివారణకు ఉప ముఖ్యమంత్రి పవన్ కల్యాణ్ ఆదేశాల మేరకు నిధులు కేటాయిస్తాం. ఘాట్ల ఆధునికీకరణ, విస్తరణను ఇరిగేషన్ శాఖ నిధుల ద్వారా అభివృద్ధి చేస్తాం" అని నారాయణ అన్నారు.

## కొలమూరు గ్రామంలో ఎస్ ఐ ఆర్ ను పరిశీలించిన హౌసింగ్ పీడీ నాతి బుజ్జి



రాజమహేంద్రవరం పెన్ పవర్, జూలై 4 :ప్రత్యేక ఓటరు జాబితా సవరణ కార్యక్రమంలో భాగంగా పీడీ హౌసింగ్ నాతి బుజ్జి శనివారం రాజమహేంద్రవరం రూరల్ మండలంలోని కొలమూరు గ్రామంలో నిర్వహిస్తున్న కార్యక్రమాలను పరిశీలించారు. ఇంటింటికీ తిరిగి ఎన్యూమరేషన్ ఫారాల సేకరణ పురోగతిని పరిశీలించడంతో పాటు, గ్రామంలో ఏర్పాటు చేసిన ప్రత్యేక శిబిరాన్ని సందర్శించి ఓటర్లకు సూచనలు చేశారు.

ఈ సందర్భంగా గ్రామ సచివాలయ సిబ్బంది, బీఎల్‌వోలు, రెవెన్యూ, పంచాయతీ, సహకార, డిజిటల్ అసిస్టెంట్, ఇంజినీరింగ్ అసిస్టెంట్, సంక్షేమ సహాయకులు తదితర శాఖల సిబ్బందితో నాతి బుజ్జి సమీక్ష నిర్వహించారు. ఈఎఫ్‌ల సేకరణ, డిజిటైజేషన్ పనులను వేగవంతం చేసి నిర్ణీత గడువులోగా పూర్తి చేయాలని ఆదేశించారు. ప్రతి అర్హత ఓటరిని చేరుకుని ఫారాల సేకరణతో పాటు డిజిటైజేషన్‌ను నాణ్యతతో పూర్తి చేసేలా సమన్వయంతో పనిచేయాలని సిబ్బందికి సూచించారు.




# అల్లూరి సీతారామరాజును చిరకాలం గుర్తుంచుకోవాలి- కలెక్టర్ కె. దినేష్ కుమార్





గంగవరం /రంపచోడవరం, పెన్ పవర్ జూలై 4: భారత స్వాతంత్ర్య సమరంలో బ్రిటిష్ పాలకులపై పోరాడి దేశ స్వాతంత్ర్యం కోసం ప్రాణత్యాగం చేసిన విప్లవ వీరుడు అల్లూరి సీతారామరాజును ప్రతి భారతీయుడు చిరకాలం గుర్తుంచుకోవాల్సిన బాధ్యత ఉందని పోలవరం జిల్లా కలెక్టర్ కె. దినేష్ కుమార్ అన్నారు.అల్లూరి సీతారామరాజు 130వ జయంతి సందర్భంగా శనివారం రంపచోడవరంలోని ఐటీడీఏ సమావేశ మందిరంలో నిర్వహించిన కార్యక్రమంలో కలెక్టర్ కె. దినేష్ కుమార్, చింతూరు ఐటీడీఏ ప్రాజెక్టు అధికారి శుభం నొక్వాల్, డీఎఫ్‌వో శివకుమార్ గంగాల్, రవీంద్రనాథ్ రెడ్డి తదితరులు అల్లూరి సీతారామరాజు చిత్రపటానికి పూలమాలలు వేసి ఘనంగా నివాళులర్పించారు.ఈ సందర్భంగా కలెక్టర్ మాట్లాడుతూ, అల్లూరి సీతారామరాజు బ్రిటిష్ సామ్రాజ్యానికి వ్యతిరేకంగా గిరిజనులను సమీకరించి స్వాతంత్ర్య పోరాటానికి నాయకత్వం వహించారని తెలిపారు. రంపచోడవరం, కృష్ణదేవిపేట, అడ్డతీగల, రాజవొమ్మంగి ప్రాంతాల్లోని పోలీస్ స్టేషన్లపై దాడులు చేసి ఆయుధాలను స్వాధీనం చేసుకుని బ్రిటిష్ పాలనకు సవాల్ విసిరారని పేర్కొన్నారు.అత్యాధునిక ఆయుధాలతో ఉన్న బ్రిటిష్ బలగాలను తన అసాధారణ ధైర్యసాహసాలతో, వ్యూహాత్మక నాయకత్వంతో ఎదుర్కొని గిరిజనుల హక్కుల కోసం పోరాడారని తెలిపారు. వ్యక్తిగత ప్రయోజనాల కోసం కాకుండా గిరిజనుల సంక్షేమం కోసం పోరాడిన ఆయన, గిరిజన గుండెల్లో చిరస్థాయిగా "మన్యం వీరుడు"గా నిలిచిపోయారని కొనియాడారు.1897 జూలై 4న జన్మించిన అల్లూరి సీతారామరాజు, స్వాతంత్ర్య పోరాటంలో పాల్గొంటూ 1924 మే 7న బ్రిటిష్ పాలకుల చేతిలో వీరమరణం పొందారని చెప్పారు. ఆయన జీవితకాలం స్వల్పమైనప్పటికీ దేశభక్తి, ధైర్యం, త్యాగం భారత చరిత్రలో చిరస్థాయిగా నిలిచాయని పేర్కొన్నారు.

అల్లూరి సీతారామరాజు సేవలను స్మరించుకునేలా ఆయన పేరుతో జిల్లాకు నామకరణం చేయడం గర్వకారణమని కలెక్టర్ అన్నారు.కార్యక్రమంలో జిల్లా రెవెన్యూ అధికారి పి. అంబేద్కర్, ఏపీవో జనరల్ డీఎన్వీ రమణ, సబ్ డీఎఫ్‌వోలు జేవీ సుబ్బారెడ్డి, రవీంద్రరావు, డీఆర్‌డీఏ పీడీ డాక్టర్ దాసరి రత్నాకర్ రావు, డీఈవో జి. శ్రీరామ్‌మూర్తి, ఐసీడీఎస్ పీడీ కె. ఉమా, జిల్లా ఉద్యానవన శాఖ అధికారి దేవదానం, పీహెచ్‌వో నరేంద్రకుమార్, వివిధ శాఖల అధికారులు, సిబ్బంది పాల్గొని అల్లూరి సీతారామరాజుకు నివాళులర్పించారు.

## నగరంలో తొలి దశ పుష్కర పనులకు రూ.580 కోట్ల నిధులు



- ఈనెల 11 న మరోసారి జిల్లా పర్యటన
- రాష్ట్ర పురపాలక, పట్టణాభివృద్ధి శాఖ మంత్రి
- డా. పి. నారాయణ

రాజమహేంద్రవరం, పెన్ పవర్, జూలై 4:గోదావరి పుష్కరాలు-- 2027ను ప్రతిష్ఠాత్మకంగా నిర్వహించేందుకు రాజమహేంద్రవరం అర్బన్ పరిధిలో తొలి దశ అభివృద్ధి పనుల కోసం కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు రూ.580 కోట్ల నిధులను విడుదల చేయనున్నట్లు రాష్ట్ర పురపాలక, పట్టణాభివృద్ధి శాఖ మంత్రి డా. పి. నారాయణ తెలిపారు.

శనివారం నగరపాలక సంస్థ కార్యాలయంలోని పీజీఆర్ఎస్ హాల్‌లో గోదావరి పుష్కరాల నిర్వహణ, చేపట్టాల్సిన అభివృద్ధి పనులు, నగర మౌలిక సదుపాయాలపై ఎంపీ దగ్గుబాటి పురందేశ్వరి, మున్సిపల్ అడ్మినిస్ట్రేషన్ కమిషనర్ పి. సంపత్ కుమార్, కలెక్టర్ కీర్తి చేకూరి, జాయింట్ కలెక్టర్ వై. మేఘా స్వరూప్, మున్సిపల్ కమిషనర్ రాహుల్ మీనా, ఎమ్మెల్యేలు గోరంట్ల బుచ్చయ్య చౌదరి, ఆదిరెడ్డి శ్రీనివాస్ లతో కలిసి మంత్రి సమీక్ష నిర్వహించారు. అనంతరం పాత్రికేయుల సమావేశంలో మాట్లాడారు.

ఈ సందర్భంగా నారాయణ మాట్లాడుతూ గోదావరి పుష్కరాలు -- 2027 మౌలిక సదుపాయాల అభివృద్ధి, వివిధ శాఖల పనుల పురోగతిపై ప్రజాప్రతినిధులు, ఉన్నతాధికారులతో సమీక్ష నిర్వహించామన్నారు. పుష్కరాలకు భారీ సంఖ్యలో భక్తులు తరలివచ్చే అవకాశాన్ని దృష్టిలో ఉంచుకుని రహదారులు, డ్రైనేజీ, తాగునీరు, పారిశుద్ధ్యం, పుష్కర ఘాట్లు తదితర మౌలిక సదుపాయాలను శాశ్వత ప్రాతిపదికన అభివృద్ధి చేయాలని అధికారులను ఆదేశించారు. మున్సిపల్ కార్పొరేషన్ పరిధిలో అభివృద్ధి పనుల కోసం తొలి దశలో రూ.580 కోట్ల నిధులు మంజూరు చేస్తున్నట్లు మంత్రి ప్రకటించారు. రాష్ట్ర ప్రభుత్వం రూ.150. కోట్లు కేటాయించ నున్నట్లు తెలిపారు. మున్సిపల్ కమిషనర్ రాహుల్ మీనా నగరంలో అమలవుతున్న అభివృద్ధి పనులపై పవర్‌పాయింట్ ప్రజెంటేషన్ ద్వారా వివరించారు. అనంతరం ఎంపీ దగ్గుబాటి పురందేశ్వరి, కలెక్టర్ కీర్తి చేకూరి, జాయింట్ కలెక్టర్ వై. మేఘాస్వరూప్, ఎమ్మెల్యేలు గోరంట్ల బుచ్చయ్య చౌదరి, ఆదిరెడ్డి శ్రీనివాస్, రుడా చైర్మన్ బొడ్డు వెంకటరమణ చౌదరి లు పుష్కరాల నాటికి పూర్తి చేయాల్సిన ప్రాధాన్య పనులపై తమ సూచనలు తెలియజేసారు. అన్ని శాఖలు సమన్వయంతో నిర్ణీత గడువులోపు పనులు పూర్తి చేసేలా కార్యాచరణ రూపొందించాలని మంత్రి అధికారులను ఆదేశించారు. అర్బన్ ఛాలెంజ్ ఫండ్, అర్బన్ ఇన్‌ఫ్రాస్ట్రక్చర్ డెవలప్‌మెంట్ ఫండ్ , యాన్యుటీ మోడల్ తదితర పథకాల ద్వారా తొలి దశలో రూ.580 కోట్ల నిధులు కేటాయిస్తున్నట్లు తెలిపారు. జూలై 11 వ తేదీన మరోసారి జిల్లా పర్యటన కు రానున్నట్టు వెల్లడించారు. ప్రజా ప్రతినిధులు, అధికారులు సమన్వయంతో ప్రాధాన్యతా పనులను గుర్తిస్తే ఈ నెల 11న పరిపాలనా అనుమతులు మంజూరు చేస్తామని తెలిపారు. గోదావరి నది కాలుష్య నివారణకు రాష్ట్ర ప్రభుత్వం ప్రాధాన్యం ఇస్తోందని, నగరంలో రూ.140 కోట్లతో అండర్‌గ్రౌండ్ డ్రైనేజీ వ్యవస్థను అభివృద్ధి చేయడం ద్వారా నదీ కాలుష్యాన్ని గణనీయంగా తగ్గించవచ్చని మంత్రి పేర్కొన్నారు. ఇరిగేషన్, దేవాదాయ, ఆర్ అండ్ బి శాఖలు పుష్కర పనులను వేగవంతం చేస్తున్నాయని తెలిపారు. ఎంపీ దగ్గుబాటి పురందేశ్వరి మాట్లాడుతూ, గోదావరి పుష్కరాలకు నిధుల సమీకరణలో ప్రభుత్వం దృష్టి సారించిందన్నారు. ఎమ్మెల్యే గోరంట్ల బుచ్చయ్య చౌదరి మాట్లాడుతూ, లక్షలాది మంది భక్తులకు ఇబ్బందులు లేకుండా శాశ్వత మౌలిక సదుపాయాల అభివృద్ధిపై దృష్టి సారించాలని కోరారు.

ఎమ్మెల్యే ఆదిరెడ్డి శ్రీనివాస్ మాట్లాడుతూ, నగరానికి రహదారులు, డ్రైనేజీ, తాగునీరు, పారిశుద్ధ్య అభివృద్ధి పనులకు తగిన నిధులు కేటాయించాలని కోరగా, మంత్రి సానుకూలంగా స్పందించారు. నగరపాలక సంస్థ కార్యాలయానికి చేరుకున్న మంత్రి డా. పి. నారాయణకు కలెక్టర్ కీర్తి చేకూరి, జాయింట్ కలెక్టర్ వై. మేఘాస్వరూప్, మున్సిపల్ కమిషనర్ రాహుల్ మీనా, ఇతర ప్రజా ప్రతినిధులు అధికారులు తదితరులు పాల్గొన్నారు.

## ఎల్‌నినో ప్రభావం వల్ల ప్రత్యామ్నాయ పంటలను ప్రోత్సహించాలి






### జిల్లా కలెక్టర్ కీర్తి చేకూరి

రాజమహేంద్రవరం, పెన్ పవర్, జులై 4:ఎల్‌నినో ప్రభావంతో ఈ ఏడాది వర్షాభావ పరిస్థితులున్న నేపథ్యంలో ఖరీఫ్ సీజన్‌కు సంబంధించి అన్ని శాఖలు సమన్వయంతో ముందస్తు కార్యాచరణ చేపట్టాలని జిల్లా కలెక్టర్ కీర్తి చేకూరి అధికారులను ఆదేశించారు. శనివారం కలెక్టరేట్‌లో వ్యవసాయం, నీటిపారుదల, ఉద్యానవనం, పశు సంవర్ధక, మత్స్యశాఖ, ఏపీ మైక్రో ఇరిగేషన్ ప్రాజెక్ట్ తదితర ప్రాథమిక రంగ శాఖల అధికారులతో ఖరీఫ్ సన్నద్ధతపై సమీక్ష నిర్వహించారు.ఈ సందర్భంగా కలెక్టర్ కీర్తి చేకూరి మాట్లాడుతూ జిల్లాలో సాధారణం కంటే 43 శాతం తక్కువ వర్షపాతం నమోదైందని తెలిపారు. మండలాల వారీగా పరిస్థితులను అంచనా వేసి రైతులకు ముందస్తు సూచనలు అందించాలని ఆదేశించారు.మెట్ట ప్రాంతాల్లో బోరు బావుల పరిస్థితి, భూగర్భ జలాల లభ్యత, గోదావరి డెల్టా ప్రాంతంలో సాగునీటి అందుబాటు, అవసరాలను క్షేత్రస్థాయిలో సమగ్రంగా అంచనా వేసి సమస్యలను ముందుగానే గుర్తించాలని సూచించారు.

నీటి లభ్యత అనిశ్చితంగా ఉన్న ప్రాంతాల్లో రైతులను వరికి బదులుగా మినుములు, మొక్కజొన్న, చిరుధాన్యాలు వంటి తక్కువ నీటి పంటల సాగుకు ప్రోత్సహించాలని తెలిపారు. తక్కువ వ్యవధిలో దిగుబడి ఇచ్చే వరి , ఇతర పంటలను ప్రోత్సహిస్తూ అధికారులు శాస్త్రీయ సలహాలు అందించాలని ఆదేశించారు. ఆయిల్ పామ్ సాగును కూడా ప్రోత్సహించాలని . నీటి సంరక్షణ చర్యలు తీసుకోవాలని స్పష్టం చేశారు. వాతావరణ పరిస్థితులను నిరంతరం పరిశీలిస్తూ రైతులకు సూచనలు అందించాలని తెలిపారు.

డ్రిప్, స్ప్రింక్లర్ వంటి సూక్ష్మ సాగునీటి పద్ధతులను ప్రోత్సహించి నీటి వనరులను పొదుపుగా వినియోగించేలా అవగాహన కల్పించాలని సూచించారు. ఈ సమావేశంలో మండలాల వారీగా సాగు పరిస్థితులు, నీటి లభ్యత, పంటల ప్రణాళికలపై జిల్లా కలెక్టర్ అధికారులను వివరాలు తెలుసుకున్నారు.

ఈ సమావేశంలో జిల్లా వ్యవసాయ అధికారి బి. వెంకటేశ్వరరావు, జిల్లా ఉద్యానవన శాఖ అధికారి ఎన్. మల్లికార్జునరావు, పీడీ ఏపీ మైక్రో ఇరిగేషన్ ప్రాజెక్ట్ ఏ. దుర్గేష్, జిల్లా మత్స్య శాఖ అధికారి ఎన్. నిర్మలాకుమారి, జిల్లా పశుసంవర్ధక శాఖ అధికారి ఏ. శ్రీనివాసరావు, నీటిపారుదల శాఖ అధికారి జి. శ్రీనివాసరావు, క్షేత్రస్థాయి వ్యవసాయ శాఖ అధికారులు తదితరులు పాల్గొన్నారు.

## కాపవరం సంతాన వెంకటేశ్వర స్వామి ఆలయం వద్ద అన్నదానం..



కోరుకొండ, పెన్ పవర్, జూలై 4:కాపవరం సంతాన వెంకటేశ్వర స్వామి ఆలయం వద్ద భారీ అన్నదాన కార్యక్రమం ఆలయ కమిటీ సభ్యులు ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా ఆలయంలో ప్రధానార్చకులు వేదాంత రామకృష్ణమాచార్యులు స్వామివారికి ప్రత్యేక పూజా కార్యక్రమాలు నిర్వహించారు. ఆలయ కమిటీ సభ్యులు వచ్చిన భక్తులందరికీ తీర్థప్రసాదాలు అందజేశారు. ఈ కార్యక్రమంలో వీరమల్ల వెంకట జేజి, కప్పల స్వామి, సీలం ఏడుకొండలు, అంబాటి రాంబాబు, సలాది వెంకటేశ్వరరావు, పెన్నాడ రాంబాబు, ఆలయ కమిటీ సభ్యులు గ్రామస్తులు తదితరులు పాల్గొన్నారు.




# జనసేన పార్టీ బలోపేతానికి కృషి చేయాలి

### ఎమ్మెల్సీ కొణిదెల నాగబాబు

గంగవరం,పెన్ పవర్ జూలై 4: జనసేన పార్టీని గ్రామస్థాయి నుంచి మరింత బలోపేతం చేసేందుకు పార్టీ నాయకులు సమన్వయంతో పనిచేయాలని ఎమ్మెల్సీ కొణిదెల నాగబాబు సూచించారు.

రంపచోడవరం కేంద్రంగా నిర్వహించిన జనసేన పార్టీ నిర్మాణ సారథుల సమాచార సేకరణ కమిటీ సమావేశంలో గంగవరం మండల ప్రతినిధిగా మాజీ మండల పార్టీ అధ్యక్షుడు కుంజం సిద్దు పాల్గొని ఎమ్మెల్సీ కొణిదెల నాగబాబును కలిశారు. ఈ సందర్భంగా గంగవరం మండలంలో పార్టీ అభివృద్ధి, సంస్థాగత బలోపేతం, పార్టీ కార్యకలాపాలపై ఆయనకు వివరించారు.అలాగే నూతన జనసేన మండల కమిటీ ఏర్పాటు అంశంపై కూడా చర్చించినట్లు కుంజం సిద్దు తెలిపారు. ఈ సందర్భంగా 2009లో నాగబాబు గంగవరం పర్యటన సందర్భంగా విద్యార్థి దశలో తనకు జరిగిన పరిచయాన్ని గుర్తు చేయగా, నాగబాబు ఆ విషయాన్ని గుర్తుచేసుకుని ఆప్యాయంగా మాట్లాడినట్లు పేర్కొన్నారు.రానున్న రోజుల్లో గంగవరం మండలంలో జనసేన పార్టీని మరింత బలోపేతం చేసి ప్రజల్లోకి తీసుకెళ్లేందుకు కృషి చేయాలని నాగబాబు సూచించినట్లు కుంజం సిద్దు తెలిపారు. సందర్భంగా జనసేన నాయకులు బయోడేటాలను పార్టీ అధిష్టానానికి సమర్పించి సంస్థ గత కమిటీల లో ప్రాధాన్యత కల్పించాలని అలాగే స్థానిక ఎన్నికల్లో పోటీ చేసేందుకు అవకాశం కలిపించాలని కోరారు .



# అటవీ హక్కుల చట్టం అమలుకు శాఖల సమన్వయం అవసరం

✹ కలెక్టర్ కె. దినేష్ కుమార్



**గంగవరం /రంపచోడవరం, పెన్ పవర్ జూలై 4:** అటవీ హక్కుల చట్టం--2006 (ఫారెస్ట్ రైట్స్ యాక్ట్) సమర్థవంతమైన అమలుకు సంబంధిత శాఖలు సమన్వయంతో పనిచేయాలని పోలవరం జిల్లా కలెక్టర్ కె. దినేష్ కుమార్ అధికారులను ఆదేశించారు. శనివారం రంపచోడవరంలోని ఐటీడీఏ సమావేశ మందిరంలో ఫారెస్ట్ రైట్స్ యాక్ట్--2006 అమలుపై నిర్వహించిన సమీక్ష సమావేశానికి కలెక్టర్ అధ్యక్షత వహించారు. సమావేశంలో చింతూరు ఐటీడీఏ ప్రాజెక్టు అధికారి శుభం నొక్వాల్, డీఎఫ్‌వోలు శివకుమార్ గంగల్, రవీంద్రనాథ్ రెడ్డి, సబ్ డీఎఫ్‌వోలు జే వి సుబ్బారెడ్డి, అటవీ శాఖ అధికారులు పాల్గొన్నారు. ఈ సందర్భంగా కలెక్టర్ మాట్లాడుతూ, చట్టం ప్రకారం అర్హులైన గిరిజనులు, ఇతర సంప్రదాయ అటవీ నివాసితులకు హక్కులను పారదర్శకంగా, నిబంధనలకు అనుగుణంగా గుర్తించి కల్పించేందుకు అధికారులు సమన్వయంతో పనిచేయాలని సూచించారు. అర్హులైన లబ్ధిదారుల దరఖాస్తులను వేగవంతంగా పరిశీలించి, పెండింగ్‌లో ఉన్న కేసులను నిర్ణీత గడువులోగా పరిష్కరించాలని ఆదేశించారు. గ్రామసభల పాత్ర అత్యంత కీలకమని పేర్కొన్న ఆయన, ప్రతి దరఖాస్తును క్షేత్రస్థాయిలో సమగ్రంగా పరిశీలించి నివేదికలు సమర్పించాలని అధికారులకు సూచించారు. గిరిజనులకు చట్టంపై అవగాహన కల్పిస్తూ అర్హులైన ప్రతి ఒక్కరికీ న్యాయం జరిగేలా చర్యలు తీసుకోవాలని అన్నారు. పోలవరం జిల్లాలో వివిధ రహదారుల నిర్మాణానికి సంబంధించిన అటవీ అనుమతుల స్థితిగతులను కలెక్టర్ సమీక్షించారు. ఇంకా పెండింగ్‌లో ఉన్న ఫారెస్ట్ క్లియరెన్స్‌లను త్వరితగతిన పూర్తి చేసి, మంజూరైన రహదారి పనులను ప్రారంభించి వేగంగా పూర్తి చేయాలని సంబంధిత శాఖల అధికారులను ఆదేశించారు. అటవీ హక్కుల చట్టం కింద ఇప్పటివరకు ఎంతమంది గిరిజనులకు భూ పట్టాలు మంజూరు చేశారో, ఎన్ని ఎకరాలు కేటాయించారో వివరాలు అడిగి తెలుసుకున్నారు. ఆంధ్ర--తెలంగాణ సరిహద్దు ప్రాంతాల్లో భూ హద్దుల నిర్వహణ, 2005 సంవత్సరానికి ముందు స్థిర నివాసం ఏర్పరుచుకున్న గ్రామాలకు రహదారుల కల్పన, ఫారెస్ట్ భూముల మ్యాపింగ్, వెబ్‌ల్యాండ్‌లో భూముల నమోదు తదితర అంశాలపై కూడా సమీక్ష నిర్వహించారు. ప్రతి వారం ఒకరోజు ఫారెస్ట్ రైట్స్ యాక్ట్ అమలుపై ప్రత్యేక సమావేశం నిర్వహిస్తామని కలెక్టర్ తెలిపారు. నేషనల్ పార్క్ పరిధిలోని గిరిజన గ్రామాలకు రహదారుల నిర్మాణం కోసం ప్రతిపాదించిన ఫారెస్ట్ క్లియరెన్స్‌లపై కూడా సమీక్షించారు. ఫారెస్ట్ క్లియరెన్స్‌కు సంబంధించిన ప్రతిపాదనలు నోడల్ అధికారి ద్వారా సమర్పించాలని, డీఎల్‌ఐసీ సమావేశంలో వాటిని పూర్తిస్థాయిలో పరిశీలించి నిర్ణయం తీసుకుంటామని పేర్కొన్నారు. సమావేశంలో జిల్లా రెవెన్యూ అధికారి పి. అంబేద్కర్, డీఆర్‌డీఏ పీడీ డాక్టర్ దాసరి రత్నాకర్ రావు, ఎగ్జిక్యూటివ్ ఇంజనీర్లు ఐ. శ్రీనివాసరావు, రాఘవరెడ్డి, జేబీవీ రెడ్డి, డీఈలు భవాని, రమేష్, ఆర్ఓఎఫ్ఆర్ కోఆర్డినేటర్ జి. ఆనంద్, రంపచోడవరం, చింతూరు డివిజన్‌లకు చెందిన ఫారెస్ట్ రేంజ్ అధికారులు తదితరులు పాల్గొన్నారు.

## బాదంపూడిలో సందడి చేసిన సినిమా షూటింగ్







**పెన్ పవర్ -- ఉంగుటూరు । జూలై 04**
ఉంగుటూరు మండలం బాదంపూడి గ్రామంలో శనివారం ఉదయం సినిమా షూటింగ్ సందడిగా సాగింది. దర్శకుడు పవన్ బాసింశెట్టి దర్శకత్వంలో తెరకెక్కుతున్న చిత్రంలోని పలు సన్నివేశాలను గ్రామంలోని వివిధ ప్రాంతాల్లో చిత్రీకరించారు.
ఈ షూటింగ్‌లో నటులు సత్య, జబర్దస్త్ రోహిణి, తమిళ హాస్యనటుడు యోగి బాబు, హీరోయిన్ జయశ్రీతో పాటు సీనియర్ నటుడు తనికెళ్ల భరణి పాల్గొన్నారు. బాదంపూడి గ్రామానికి చెందిన చిన్నారులతో కలిసి భక్తాంజనేయ స్వామి ఆలయం వద్ద, గోదావరి కాలువ గట్టు, ప్రధాన రహదారిపై పలు సన్నివేశాలను చిత్రీకరించారు.
అనంతరం భక్తాంజనేయ స్వామి ఆలయంలో పూజారి కె. ఫణికుమార్ ఆధ్వర్యంలో సినీ ప్రముఖులు స్వామివారికి అభిషేకం నిర్వహించి ప్రత్యేక పూజలు చేశారు.
ఈ కార్యక్రమంలో ఆలయ కమిటీ సభ్యులు వంకిన వెంకటేశ్వరరావు, మిరపాల శ్రీహరి, గులిపల్లి నాగు తదితరులు సహకరించారు.
బాదంపూడి గ్రామ పరిసర ప్రాంతాలు సహజసిద్ధమైన అందాలతో సినిమా, టెలివిజన్ సీరియల్ షూటింగ్‌లకు ఎంతో అనుకూలంగా ఉన్నాయని పలువురు అభిప్రాయపడ్డారు.

# శ్రీ విజేతలో అల్లూరి జయంతి



**తాళ్లపూడి, పెన్ పవర్, జూలై 4:** తాళ్లపూడిలోని శ్రీ విజేత హై స్కూల్ నందు శనివారం మన్యం వీరుడు అల్లూరి సీతారామరాజు జయంతి కార్యక్రమం నిర్వహించారు. ప్రధానోపాధ్యాయులు డా జె వి ప్రమోద్ కుమార్ ఆధ్వర్యంలో విద్యార్థులు అల్లూరి చిత్రపటానికి నివాళులు అర్పించారు. అనంతరం సీతారామరాజు జీవిత విశేషాలను విద్యార్థులకు వివరించారు. అల్లూరి జయంతిని పురస్కరించుకుని విద్యార్థులకు చిత్రలేఖనం పోటీలు నిర్వహించి, విజేతలకు బహుమతులు అందచేశారు. కార్యక్రమంలో అధ్యాపక బృందం, విద్యార్థులు పాల్గొన్నారు.



**పెన్ పవర్ -- ఉంగుటూరు, జూలై 04**
గ్రామాల్లో మౌళిక వసతుల కల్పన కోసం ముఖ్యమంత్రి అవిరళ కృషి చేస్తున్నారని ఆఫ్కాబ్ ఛైర్మన్ గన్ని వీరాంజనేయులు అన్నారు. శనివారం ఆయన ఉంగుటూరు మండలం నారాయణపురం గ్రామంలో పలు అభివృద్ధి కార్యక్రమాల్లో పాల్గొన్నారు.
ఈ సందర్భంగా టూరింగుపేట నుంచి గోపీనాథపట్నం వరకు ఉపాధి హామీ పథకం నిధులతో రూ. 1.56 కోట్ల వ్యయంతో నిర్మించిన సీసీ రోడ్డును స్థానిక నాయకులు ఆయనకు చూపించారు.
అనంతరం గ్రామంలోని చెబ్రోలు ఎగువ ప్రాంతాల నుంచి వచ్చే వర్షపు నీరు, మురుగునీరు ఎస్సీ కాలనీ, వైఎస్సార్ కాలనీ మీదుగా గ్రామంలోకి ప్రవహిస్తున్న సమస్యను నాయకులు గన్ని వీరాంజనేయుల దృష్టికి తీసుకెళ్లారు. దీనికి శాశ్వత పరిష్కారంగా సీసీ మురుగు కాలువ నిర్మాణానికి కృషి చేయాలని కోరారు.
ఈ సమస్యను ఎంపీ పుట్టా మహేష్ కుమార్ దృష్టికి తీసుకెళ్లి, అవసరమైన నిధులు మంజూరు అయ్యేలా తన వంతు ప్రయత్నం చేస్తానని గన్ని గ్రామస్థులకు హామీ ఇచ్చారు.
అనంతరం ఇటీవల పలు కారణాలతో మృతి చెందిన తెలుగుదేశం పార్టీ అభిమానుల కుటుంబాలను పరామర్శించి, వారికి ప్రగాఢ సానుభూతి తెలిపారు.
ఈ కార్యక్రమంలో మండల కమిటీ అధ్యక్షుడు వేములపల్లి సుధీర్, క్లస్టర్ ఇన్‌ఛార్జి నల్ల ఆనంద్, మాజీ సర్పంచ్ దిడ్ల అలకనంద శ్రీను, కొండ్రెడ్డి శ్రీనివాస్, తిర్లంగి పోలయ్య, నరేంద్ర, నాగరాజు తదితరులు పాల్గొన్నారు.

# డైమండ్స్ లయన్స్ క్లబ్ అల్లూరి జయంతి..






✹ భవితరాల కు మహనీయులు జీవిత విశేషాలు తెలియపరచండి
✹ రిజియాన్ఛైర్ పర్సన్ లయన్ పేరిచర్ల మురళీ కృష్ణంరాజు.

**తాడేపల్లిగూడెం. పెన్ పవర్. జూలై 04:** అల్లూరి విగ్రహం వద్ద డైమండ్స్ లయన్స్ క్లబ్ అధ్యక్షులు చెన్నా రెడ్డి సతీష్ అధ్యక్షతన అల్లూరి జయంతి వేడుకలు. నిర్వహించారు. పూల మాలలు వేసి నివాళులు అర్పించారు.. ముఖ్య అతిధి గా రిజియన్ ఛైర్ పర్సన్ లయన్ పేరిచర్ల మురళీ కృష్ణంరాజు లయన్ ఇంద్ర వాణి ఆధ్వర్యంలో జరిగిన వ్యాస రచన పోటీలలో విజేతలు కు బహుమతులు అందించారు. లయన్ పేరిచర్ల మాట్లాడుతూ బ్రిటిష్ వారి అటవీ చట్టాలను వ్యతిరేకిస్తూ, అమాయక గిరిజనులకు అండగా నిలిచారు. "ఎవడురా నన్ను పాలించేది" అంటూ గర్జించి, చింతపల్లి, అడ్డతీగల, రంపచోడవరం పోలీస్ స్టేషన్లపై దాడులు చేసి తెల్లదొరల గుండెల్లో రైళ్లు పరిగెత్తించారు. గెరిల్లా పోరాటంలో ఆయన చూపిన వ్యూహాలు బ్రిటిష్ సైన్యాలను సైతం బెంబేలెత్తించాయి.
అల్లూరి సీతారామరాజు కేవలం ఒక వ్యక్తి కాదు, ఆయనో అజేయమైన శక్తి. తన స్వార్థం కోసం కాకుండా, దేశం కోసం, ప్రజల స్వేచ్ఛ కోసం తన ప్రాణాలను సైతం తృణప్రాయంగా అర్పించారు. మే 7, 1924న ఆయన వీరమరణం పొందినప్పటికీ, ఆయన స్ఫూర్తి నేటి తరానికి ఆదర్శం. నేటి యువత అల్లూరి దేశభక్తిని, ధైర్యాన్ని ఆదర్శంగా తీసుకొని, దేశ నిర్మాణంలో భాగస్వామ్యం కావాలని కోరుకుంటూన్నామమన్నారు లయన్ చేరుకు వాడ అప్పల రామకృష్ణ వర్మ వివేకానంద వర్ధంతి సందర్బంగా విద్యార్థులకు వివేకానంద బోధనల పుస్తకాలు పంపిణీ చేశారు. ఈ కార్యక్రమం లో డైమండ్స్ సభ్యులు కృష్ణ కాంత్.. నార్ని వెంకట కృష్ణరావు ఆకుల సతీష్. కోఠి విజయ్ కిషోర్. తమ్మా బత్తుల సత్యనారాయణ. గాదిరాజు రాము. దాట్ల జగన్నాధరాజు తదితరులు పాల్గొన్నారు.

## వెదురు ఉత్పత్తులతో మహిళల ఆర్థికాభివృద్ధికి చర్యలు

కలెక్టర్ కె. దినేష్ కుమార్



**గంగవరం /రంపచోడవరం, పెన్ పవర్ జూలై 4 :** పోలవరం జిల్లాలో గిరిజన మహిళలు వెదురు ఉత్పత్తుల ద్వారా ఆర్థికంగా అభివృద్ధి చెందేందుకు ప్రత్యేక చర్యలు చేపడుతున్నామని జిల్లా కలెక్టర్ కె. దినేష్ కుమార్ తెలిపారు. శనివారం రంపచోడవరంలోని ఐటీడీఏ సమావేశ మందిరంలో డీఆర్‌డీఏ అధికారులు, సబ్ డీఎఫ్‌వోలు, ఫారెస్ట్ రేంజ్ అధికారులు, ఐఎస్‌బీ ప్రతినిధులతో కలిసి వెదురు ఉత్పత్తుల అభివృద్ధిపై జిల్లా కలెక్టర్ సమీక్ష సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా కలెక్టర్ మాట్లాడుతూ, మహిళా సంఘాల సభ్యులకు వెదురు ఆధారిత ఉత్పత్తుల తయారీలో శిక్షణ, ప్రోత్సాహం అందించి ఆర్థికంగా బలోపేతం చేసే దిశగా చర్యలు తీసుకుంటున్నామని తెలిపారు. జిల్లాలో ఉన్న వన సంరక్షణ సమితుల (వీఎస్ఎస్) సంఖ్య, వాటి వార్షిక ఆదాయం, ఆ ఆదాయాన్ని అభివృద్ధి కార్యక్రమాలకు ఎలా వినియోగిస్తున్నారనే అంశాలపై అధికారులను అడిగి తెలుసుకున్నారు. అరణ్యశ్రీ అభివృద్ధికి గ్రామసభల్లో తప్పనిసరిగా తీర్మానాలు చేయాలని సూచించిన ఆయన, కేంద్ర ప్రభుత్వం ప్రతి సిఎఫ్ఆర్ కమిటీకి గిరిజన అభివృద్ధి కోసం రూ. 15 లక్షలు మంజూరు చేస్తోందన్నారు. ప్రభుత్వ నిబంధనల ప్రకారం కేటాయించిన భూముల్లో మొక్కలు నాటి అభివృద్ధి చేసిన అనంతరం ఆయా గ్రామాల అభివృద్ధి కార్యక్రమాలకు ఈ నిధులను వినియోగించనున్నట్లు తెలిపారు. జిల్లాలోని వివిధ గ్రామాల్లో వెదురు సాగు, వెదురు ఉత్పత్తులపై అవగాహన కార్యక్రమాలు నిర్వహించాలని అధికారులను ఆదేశించారు. సిఎఫ్ఆర్ యాక్షన్ ప్లాన్‌లను సిద్ధం చేసి సమర్పించాలని సూచించారు. గిరిజన మహిళలు తయారు చేసే వెదురు ఉత్పత్తులను మార్కెట్‌కు అనుసంధానం చేసే దిశగా చర్యలు తీసుకుంటామని కలెక్టర్ తెలిపారు. అడవి ఉత్పత్తుల ప్రాసెసింగ్ కోసం దేవరపల్లి గ్రామంలో ప్రాసెసింగ్ యూనిట్ ఏర్పాటు చేసినట్లు వెల్లడించారు. వెదురు ఉత్పత్తుల ద్వారా గ్రామీణ, గిరిజన మహిళల ఆదాయం పెరిగేలా డీఆర్‌డీఏ అధికారులు ప్రత్యేకంగా ప్రోత్సహించాలని కలెక్టర్ సూచించారు. ఈ సమావేశంలో సబ్ డీఎఫ్‌వోలు సుబ్బారెడ్డి, రవీంద్రనాథ్, డీఆర్‌డీఏ పీడీ డాక్టర్ దాసరి రత్నాకర్ రావు, డీపీఎం దుర్గాప్రసాద్, ఫారెస్ట్ రేంజ్ అధికారులు జీవి నానాజీ, ఆజాద్, ఐఎస్‌బీ ప్రతినిధులు హేమంత్, పసంగి, ఆర్ఓఎఫ్ఆర్ కోఆర్డినేటర్ జి. ఆనంద్ తదితరులు పాల్గొన్నారు.

## భారత చైతన్య యువజన పార్టీ ఏపీ పీఏసీ సభ్యుడిగా రాంబాబు యాదవ్ నియామకం




**పెన్ పవర్ -- ఉంగుటూరు । జూలై 04**
ఉంగుటూరు మండలం అక్కుపల్లి-గోకవరం గ్రామానికి చెందిన పంది రాంబాబు యాదవ్‌ను భారత చైతన్య యువజన పార్టీ ఆంధ్రప్రదేశ్ పీఏసీ సభ్యుడిగా నియమిస్తూ పార్టీ రాష్ట్ర అధ్యక్షుడు బోడె రామచంద్ర యాదవ్ శనివారం నియామక ఉత్తర్వులు జారీ చేశారు.
ఈ సందర్భంగా రాంబాబు యాదవ్ మాట్లాడుతూ, పార్టీ బలోపేతానికి కృషి చేస్తానని, పార్టీ సిద్ధాంతాలు, విధానాలను గ్రామస్థాయి వరకు తీసుకెళ్లేందుకు కట్టుబడి పనిచేస్తానని తెలిపారు. తనపై నమ్మకం ఉంచి ఈ బాధ్యత అప్పగించిన పార్టీ రాష్ట్ర అధ్యక్షుడు బోడె రామచంద్ర యాదవ్‌కు ప్రత్యేక కృతజ్ఞతలు తెలిపారు.
రాంబాబు యాదవ్ రాజకీయ ప్రస్థానంలో గతంలో కాంగ్రెస్ పార్టీ తరపున అక్కుపల్లి-గోకవరం ఎంపీటీసీ సభ్యుడిగా భారీ మెజార్టీతో విజయం సాధించారు. అనంతరం వైఎస్సార్సీపీ మండల అధ్యక్షుడిగా పనిచేశారు. తరువాత జనసేన పార్టీలో చేరి మండల అధ్యక్షుడిగా బాధ్యతలు నిర్వహించారు. అయితే, పార్టీలో తగిన గుర్తింపు, గౌరవం లభించకపోవడంతో స్వచ్ఛందంగా రాజీనామా చేశారు.
భారత చైతన్య యువజన పార్టీలో ఆంధ్రప్రదేశ్ స్థాయిలో కీలక బాధ్యత దక్కడం పట్ల పలువురు నాయకులు, పార్టీ కార్యకర్తలు, అభిమానులు హర్షం వ్యక్తం చేస్తూ రాంబాబు యాదవ్‌కు అభినందనలు తెలిపారు.

## ఘనంగా అల్లూరి సీతారామరాజు 129 జయంతి వేడుకలు



**తాడేపల్లిగూడెం. పెన్ పవర్. జూలై 04:** మన్యం వీరుడు అల్లూరి సీతారామరాజు 129 జయంతి వేడుకలు క్షత్రియ సేవా సమాఖ్య ప్రజా సంఘాల ఆధ్వర్యంలో స్థానిక ఆర్ టి సి. డిపో వద్ద గల అల్లూరి విగ్రహం వద్ద ఘనంగా జరిగాయి. క్షత్రియ నాయకులు చెరుకు వాడ ఏ ఆర్ కే. వర్మ ఆధ్వర్యంలో జరిగిన కార్యక్రమం లో పలువురు ప్రముఖులు పాల్గొన్నారు. లయన్ క్లబ్ రీజియన్ ఛైర్ పర్సన్ లయన్ పేరిచర్ల మురళీ కృష్ణంరాజు హైకోర్టు న్యాయవాది యెలిశెట్టి సోమరాజు తెలుగుదేశం నాయకులు దాట్ల జగన్నాధరాజు తదితరులు మాట్లాడారు భారతదేశ స్వాతంత్ర్య సంగ్రామంలో తన ప్రాణాలను సైతం తృణప్రాయంగా భావించి, బ్రిటీష్ సామ్రాజ్యాన్ని గడగడలాడించిన మన్యం వీరుడు అల్లూరి సీతారామరాజు జయంతిని జరుపుకోవడం ఎంతో గర్వకారణం. 1897 జూలై 4న జన్మించిన అల్లూరి, కేవలం 26 సంవత్సరాల వయస్సులోనే అఖండమైన ధైర్యసాహసాలను ప్రదర్శించారు. మన్యంలోని గిరిజనులను సమీకరించి, అడవుల హక్కుల కోసం బ్రిటిష్ పాలకుల తుపాకీ కి గుండె ఏదురోడ్డి పోరాడిన వీరుడు అల్లూరి అన్నారు అలానే స్వామి వివేకానంద వర్ధంతి సందర్భంగా నివాళులు అర్పించారు.
ఈకార్యక్రమ లో విశ్రాంత పోలీస్ సబ్ ఇన్స్పెక్టర్ ఖ. నరసింహ రాజు గాదిరాజు అచ్యుత రామరాజు లయన్ చెన్నారెడ్డి సతీష్. నార్ని వెంకట కృష్ణారావు. ఆకుల సతీష్. కృష్ణ కాంత్. ఇంద్రవాణి. శ్రీనివాసరాజు నిమ్మకాయల సత్యనారాయణ నీలం సురేష్. జామి. సురేష్ ఆంజనేయరాజు. రామచంద్రం రాజు యాదల
శివాజీ. తదితరులు పాల్గొన్నారు
పూల మాలలు వేసి నివాళులు అర్పించారు.


## మన్యం వీరుడు అల్లూరి సేవలు చిరస్మరణీయం

- మండలంలో అల్లూరి జయంతి ఘనంగా



**కూనవరం,పెన్ పవర్,జూలై4.**
మన్యం వీరుడు అల్లూరి సీతారామరాజు 130వ జయంతి సందర్భంగా కూనవరం మండలంలోని టేకులబోరు గ్రామంలో అల్లూరి విగ్రహానికి సీపీఎం నాయకులు పూలమాల వేసి ఘనంగా నివాళులర్పించారు.
ఈ సందర్భంగా సీపీఎం మండల కార్యదర్శి బాబు బొర్రయ్య మాట్లాడుతూ దేశ స్వాతంత్ర్యం కోసం అల్లూరి సీతారామరాజు చేసిన త్యాగాలుచిరస్మరణీయమని కొనియాడారు.గిరిజనులహక్కులు,స్వాభిమాన పరిరక్షణ కోసం ఆయన చేసిన పోరాటం నేటి తరానికి ఆదర్శమని పేర్కొన్నారు. అల్లూరి ఆశయాలను ముందుకు తీసుకెళ్లాలని,సామాజిక న్యాయం, ప్రజల హక్కుల సాధన కోసం కృషి చేయాలని పిలుపునిచ్చారు. సీపీఎం నాయకులు,కార్యకర్తలు, గ్రామ ప్రజలు పాల్గొన్నారు


## ఘనంగా రంగ జయంతి వేడుకలు



**జీలుగుమిల్లి, పెన్ పవర్ ,జులై 4 ;** ప్రజా సమస్యల పరిష్కారం కోసం నిరంతరం పోరాడిన నాయకుడిగా వంగవీటి మోహన్ రంగ ప్రజల హృదయాల్లో చిరస్థాయిగా నిలిచిపోయారని పోలవరం ఎమ్మెల్యే చిర్రి బాలరాజు అన్నారు. శనివారం జీలుగుమిల్లిలో రంగ విగ్రహానికి పూలమాలవేసి, రెండు నిమిషాలు మౌనం పాటించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ప్రజల పట్ల అంకితభావం ,ధైర్య సాహసాలు, సేవా తత్పరత నీటి యువతకు రంగ ఆదర్శప్రాయుడని అన్నారు. ఈ కార్యక్రమంలో కూటమి నాయకులు బండారు అనిల్, బాసిన రాజబాబు, రూప సత్యనారాయణ, కుంజా రమేష్, కురం వెంకటేష్, దేవుడు శ్రీను, నేలటూరి మోహన్ ,నాలి శ్రీను, కోలాధర్మరాజు, గుడిల్లి లక్ష్మీనారాయణ, మద్దాల రమేష్ తదితరులు పాల్గొన్నారు.

## ఘనంగా విప్లవ వీరుడు అల్లూరి శ్రీరామరాజు129 జయంతి.





**అడ్డతీగల, పెన్ పవర్, జూలై 04**: అడ్డతీగల మండలం పైడి పుట్ట గ్రామంలో అల్లూరి శ్రీరామరాజు జయంతి ఉత్సవాలు శనివారం ఉదయం నుండి ప్రారంభమయ్యాయి. నూతనంగా నిర్మిస్తున్న అల్లూరి రచ్చబండ వద్ద శుక్రవారం ఉదయం గంగాలమ్మ తల్లి విగ్రహ ప్రతి జరిపి పూజా కార్యక్రమం నిర్వహించారు అనంతరం శనివారం ఉదయం హోమం నిర్వహించి అల్లూరి జయంతి ఉత్సవాలను ప్రారంభించారు. అనంతరం అడ్డతీగల ఆదివాసి భవనంలో అల్లూరి శ్రీరామరాజు జయంతి వేడుకలను ఘనంగా జరిగింది. ఈ సందర్భంగా ప్రముఖులు మాట్లాడుతూ అల్లూరి శ్రీరామరాజు అడవి బిడ్డల కోసం తన ప్రాణత్యాగానికి అహర్నిశలు కృషి చేశారని పలువురు కొనియాడారు. అల్లూరి శ్రీరామరాజు అడవి బిడ్డల కోసం పైడి పుట్ట గ్రామంలో ఉంటూ స్వతంత్ర ఉద్యమానికి శ్రీకారం చుట్టారని మన్యం బిడ్డల కోసం పోరాడిన స్ఫూర్తి వెలకట్టలేందని పలువురు కొనియాడారు. ఈ సందర్భంగా కార్యక్రమానికి విచ్చేసిన ప్రముఖులు మాట్లాడుతూ అల్లూరి శ్రీరామరాజు అడవి బిడ్డల ఆశాజ్యోతిని వారి సమస్యల కోసం నిరంతరం పోరాడి తన ప్రాణాలను తృణప్రాయంగా త్యాగం చేసిన మహోన్నత వ్యక్తిని కొనియాడారు. ఆయన స్ఫూర్తితో ముందుకు సాగాలని ముఖ్యంగా ముఖ్యంగా యువత అల్లూరిని ఆదర్శంగా తీసుకోవాలని పలువురు ప్రముఖులు పిలుపునిచ్చారు. అల్లూరి త్యాగాలకు ఐక్యంగా కృషి చేయాలని ఈ కార్యక్రమంలో పిలుపునిచ్చారు. ఈ కార్యక్రమంలో ధనవంత్రి సహస్రా య పీఠం అధినేత డాక్టర్ రవి వర్మ, సంఘం గౌరవ అధ్యక్షులుమంతెన వెంకట సత్యనారాయణ రాజు, అధ్యక్షులు సాగిన. సత్యనారాయణ రాజు , ప్రెసిడెంట్ వేటుకూరు. కృష్ణంరాజు, సెక్రటరీ ఇళ్ల. శ్రీకాంత్, వైస్ ప్రెసిడెంట్ నాగార్జున రాజు, దంతులూరి .సంతోష వర్మ, చోడిశెట్టి. సుబ్బారావు, స్టార్ శ్రీను, అల్లూరి. శ్రీరామరాజు, హర దీపక్, రాధమ్మ, పార్వతి పైడి పుట్ట గ్రామస్తులు పాల్గొన్నారు.

# మన్యం వీరుడు అల్లూరి సీతారామరాజుకు ఘన నివాళి



**సీతానగరం, పెన్ పవర్, జూలై04:** స్వాతంత్ర్య సంగ్రామ విప్లవ జ్యోతి, మన్యం వీరుడు, సాయుధ పోరాట యోధుడు అల్లూరి సీతారామరాజు జయంతి సందర్భంగా సీతానగరం మండల కేంద్రంలో చిన కొండేపూడి గ్రామంలో వైయస్సార్ కాంగ్రెస్ పార్టీ అమలాపురం పార్లమెంట్ నియోజకవర్గం పరిశీలకులు జక్కంపూడి విజయలక్ష్మి పాల్గొని అల్లూరి సీతారామరాజు జయంతి సందర్భంగా ఆయన విగ్రహానికి పూలమాలలు వేసి నివాళులర్పించారు. సందర్భంగా వారు మాట్లాడుతూ, బ్రిటిష్ పాలకుల నిరంకుశ విధానాలకు వ్యతిరేకంగా పోరాడి గిరిజనుల హక్కుల పరిరక్షణ కోసం ప్రాణత్యాగం చేసిన అల్లూరి సీతారామరాజు భారత జాతికి స్ఫూర్తి ప్రదాత అని పేర్కొన్నారు. స్వాతంత్ర్య సమర చరిత్రలో ఆయన చూపిన ధైర్యసాహసాలు, దేశభక్తి, త్యాగనిరతి నేటి యువతకు ఆదర్శంగా నిలుస్తున్నాయని అన్నారు. న్యాయం కోసం పోరాడే సంకల్పం, దేశం పట్ల అంకితభావం ప్రతి ఒక్కరూ అలవరచుకోవాలని సూచించారు. అల్లూరి సీతారామరాజు ఆశయాలను కొనసాగిస్తూ సమాజాభివృద్ధికి కృషి చేయడం ద్వారా ఆయనకు నిజమైన నివాళి అర్పించిన వారమవుతామని తెలిపారు.
ఈ కార్యక్రమంలో వైయస్సార్సీపీ నాయకులు కార్యకర్తలు అధిక సంఖ్యలో పాల్గొన్నారు.

02
ఇప్పుడు పెన్ పవర్ దిన పత్రికలో
శుభాకాంక్షలు యాడ్స్
కేవలం
యాడ్ 300/-
'పోస్టుకార్డు సైజు '
'పో. 12 సెం.మీ, వె.16 సెం.మీ'
'మరిన్ని వివరాలకు సంప్రదించండి '
93948 55244
షరతులు వర్తిస్తాయి

## రంగా ఆశయాలు సాధిద్దాం: బొలిశెట్టి రాజేష్



**తాడేపల్లిగూడెం. పెన్ పవర్. జులై 04:** పేదల పెన్నిధి, బడుగు బలహీన వర్గాల అభ్యున్నతి కోసం జీవితాన్ని అంకితం చేసిన మహానేత వంగవీటి మోహనరంగా ఆశయాల సాధనకు కృషి చేయాలని జనసేన యువనేత బొలిశెట్టి రాజేష్ అన్నారు. రంగా మిత్రమండలి ఆధ్వర్యంలో స్థానిక గొల్లగూడెం సెంటర్లో శనివారం వంగవీటి మోహన రంగా జయంతి నిర్వహించారు. రంగా విగ్రహానికి పూలమాలలు వేసి నివాళులర్పించారు. ఈ సందర్భంగా జనసేన యువనేత బొలిశెట్టి రాజేష్ మాట్లాడుతూ అన్ని వర్గాల ప్రజల ఆదరాభిమానాలు పొందిన నాయకుడు రంగా ను ఆదర్శంగా తీసుకొని ప్రజా సేవకు పాటుపడాలని అన్నారు.

# కూటమి ధర్మం పాటించండి



**వలవల బాబ్జికి బిజెపి, టిడిపి నేతల సూచన**

**తాడేపల్లిగూడెం, పెన్ పవర్ జులై 04.** ప్రభుత్వ కార్యక్రమాలే కాకుండా, తన సొంత నిధులను కూడా వెచ్చించి నియోజకవర్గ అభివృద్ధికి అహర్నిశలు కృషి చేస్తున్న శాసనసభ్యులు, రాష్ట్ర ప్రభుత్వ విప్ బొలిశెట్టి శ్రీనివాస్ ను గౌరవించాలని టిడిపి, బిజెపి పార్టీల నాయకులు టిడిపి ఇంచార్జి వలవల బాబ్జి కి సూచించారు. స్థానిక గొల్లగూడెం కూడలి వద్ద సెలక్షన్ గ్రాండ్ హోటల్ లో శనివారం బిజెపి, టిడిపి నాయకులు మీడియా సమావేశం నిర్వహించారు. ఈ సమావేశంలో నేతలు మాట్లాడుతూ ఒక నియోజకవర్గంలో ఎమ్మెల్యేకు మాత్రమే ప్రజలు అధికారం ఇస్తారని, మిగతా నాయకులు ప్రజాతీర్పును గౌరవించాలని అన్నారు. ఎమ్మెల్యే బొలిశెట్టి శ్రీనివాస్ రాష్ట్రంలోనే ఉత్తమ పనితీరుతో ముఖ్యమంత్రి చంద్రబాబు నాయుడు, ఉప ముఖ్యమంత్రి పవన్ కళ్యాణ్ ల ప్రశంసలు పొందారని, స్థానికంగా కూటమి నాయకులు ఆ గౌరవాన్ని కాపాడుకోవాలని అన్నారు. తాను కూటమి ఎమ్మెల్యే గా వ్యవహరిస్తానని, కూటమిలో మూడు పార్టీలకు చెందిన వారందరూ తనకు సమానమేనని అనేక సందర్భాల్లో ఎమ్మెల్యే తెలియజేశారని అన్నారు. బొలిశెట్టి పై వ్యక్తిగత అసూయతో కూటమిని బలహీనపరచవద్దని కోరారు. తాడేపల్లిగూడెంలో బొలిశెట్టి కి ముందు, తర్వాత అనే స్థాయిలో అభివృద్ధి జరుగుతోందని, కూటమి నాయకుడే అభివృద్ధిని అడ్డుకునే విధంగా ప్రవర్తించడం తగదని అన్నారు. వ్యక్తిగత సమస్యలు ఉంటే అంతర్గత సమావేశాలలో పరిష్కరించుకోవాలని, అలా కాకుండా మీడియాలో తప్పుడు ప్రచారం చేయించటం సమంజసం కాదన్నారు. తనకు గిట్టని వారిపై ఒకరిద్దరు మీడియా వారిని పిలిచి తప్పుడు రాతలు రాయించడం మానుకోవాలని కోరారు. ఇప్పటికయినా బాబ్జి తన వైఖరి మార్చుకొని , కూటమి ధర్మాన్ని పాటించాలని నాయకులు కోరారు. రాష్ట్రంలో అభివృద్ధి సంక్షేమ కార్యక్రమాలు భారీగా జరుగుతున్నాయని, సమర్థవంతమైన కూటమి ప్రభుత్వానికి ప్రతి ఒక్కరు సహకరించాలని అన్నారు. ఈ సమావేశంలో తాడేపల్లిగూడెం నియోజకవర్గ బిజెపి ఇంచార్జి ఈతకోట తాతాజీ, బిజెపి జిల్లా నాయకుడు నరిసే సోమేశ్వరరావు, టిడిపి జిల్లా నాయకుడు వాడపల్లి సుబ్బరాజు, టిడిపి నాయకులు బేతిన గిరి, వట్టికూటి అబ్బు, పసల కొండ, పసుమర్తి లక్ష్మణ్, పిల్లా రాంబాబు, వీర్ల కృష్ణ, మద్దీపాటి రవితేజ, శనగన రాంబాబు, రామగాని సత్యనారాయణ, మద్దీపాటి ధర్మేంద్ర, ఎరుబండి సతీష్ తదితరులు పాల్గొన్నారు.

## సీజనల్ వ్యాధులు ప్రబలకుండా పారిశుద్ధ్య పనులు చేపట్టాలి



**-ఎంపీడీవో ఆశీర్వాదం**

**కూనవరం,పెన్ పవర్,జూలై4.** వర్షాకాలం నేపథ్యంలో సీజనల్ వ్యాధులు ప్రబలకుండా పారిశుధ్య పనులపై ప్రత్యేక దృష్టిసారించాలని ఎంపీడీవో ఎస్ ఆశీర్వాదం అధికారులను ఆదేశించారు. కార్యాలయం నందు అత్యవసర సమావేశాన్ని శనివారం నాడు నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ మండల కేంద్రంలో ఉన్నటువంటి డ్రైనేజీలు, కాలువలు,మురికి గుంటలు లేకుండా చూడాలని డిప్యూటీ ఎంపీడీవో జగన్నాథ రావు మండలంలోని పంచాయతీ సెక్రెటరీలకు సూచించారు. వర్షాకాలం సీజన్ కావడంతో మలేరియా,డెంగ్యూ, చికెన్ గున్యా వంటి విష జ్వరాలు ప్రబలే ప్రమాదం ఉందని,ముందస్తు జాగ్రత్తగా డ్రైనేజిలలో నీరు నిల్వ ఉండకుండా చూడాలని తెలిపారు. శానిటేషన్ మరియు బ్లీసింగ్ మలేరియా యాక్టివిటీస్ ఫ్రైడే - డ్రైడే,ఏఎల్ఓ ఫాగ్గింగ్ లాంటి కార్యక్రమాలు నిర్వహించాలని అన్నారు. ఈ కార్యక్రమంలో పంచాయతీ సెక్రటరీస్ మరియు స్థానిక మెడికల్ సిబ్బంది పాల్గొన్నారు.

## నారాయణపురంలో 37 మందికి పీఎంఏవై ఇళ్లు




**పెన్ పవర్ ఉంగుటూరు, జులై 04**
ప్రధాన మంత్రి ఆవాస్ యోజన (పీఎంఏవై) తొలి విడతలో నారాయణపురం గ్రామానికి చెందిన 37 మంది అర్హులైన లబ్ధిదారులకు గృహాల మంజూరు కోసం ప్రతిపాదిత జాబితాను శనివారం నిర్వహించిన గ్రామసభలో ఆమోదించారు.
గ్రామంలో మొత్తం 48 మంది దరఖాస్తు చేసుకోగా, సిక్స్ స్టెప్ వెరిఫికేషన్‌లో ఒక దరఖాస్తు తిరస్కరణకు గురైంది. మిగిలిన 47 మంది అర్హుల్లో తొలి విడతలో 37 మందికి గృహాలు మంజూరయ్యాయని, వారి జాబితాను శాంక్షన్ కోసం ఉన్నతాధికారులకు పంపించినట్లు గ్రామ ప్రత్యేకాధికారి, పంచాయతీ రాజ్ ఏఈ కృష్ణమోహన్ తెలిపారు.
మిగిలిన అర్హులైన లబ్ధిదారులకు రెండో విడతలో గృహాలు మంజూరయ్యే అవకాశం ఉందని ఆయన పేర్కొన్నారు.
ఈ సమావేశంలో గృహనిర్మాణ శాఖ ఏఈ చింతలపూడి సతీష్, పంచాయతీ అభివృద్ధి అధికారి నేతల విజయ్‌కుమార్‌తో పాటు గ్రామస్థులు పాల్గొన్నారు.

# కూనవరం మండలంలో విద్యుత్ అంతరాయాలతో ప్రజలు ఇబ్బంది



**కూనవరం,పెన్ పవర్,జూలై4.** కూనవరం,వి ఆర్ పురంలో తరచూ జరుగుతున్న విద్యుత్ అంతరాయాలతో ప్రజలు తీవ్ర ఇబ్బందులు పడుతున్నారని సీపీఎం జిల్లా కార్యదర్శి బొప్పెన కిరాణ్ ఆవేదన వ్యక్తం చేశారు.
విద్యుత్ కోతలతో విద్యార్థుల చదువులు,రైతులు,వ్యాపారులు, తాగునీటి సరఫరాకు ఆటంకం కలుగుతోందని తెలిపారు. ముందస్తు సమాచారం లేకుండా కరెంటు తీయడం సరికాదని, ఉన్నతాధికారులు వెంటనే స్పందించి నిరంతర సరఫరా కల్పించాలని డిమాండ్ చేశారు. ఈ సమావేశంలో జిల్లా కమిటీ సభ్యులు మేకల నాగేశ్వరరావు, మండల కార్యదర్శి బాబు బొర్రయ్య,నాగమణి,ఎంపీటీసీ అమ్మాజీ,కర్నాటి శ్రీనివాసరావు తాలూరి శ్రీనివాసరావు,దన్నూరి శ్రీనివాసరావు తదితరులు పాల్గొన్నారు పాల్గొన్నారు.

# అల్లూరి విప్లవ స్ఫూర్తిని ప్రతి ఒక్కరూ అలవర్చుకోవాలి

**గంగవరం, పెన్ పవర్ జూలై 4:** స్వాతంత్ర్య సమరయోధుడు, మన్యం వీరుడు అల్లూరి సీతారామరాజు విప్లవ స్ఫూర్తిని ప్రతి ఒక్కరూ ఆదర్శంగా తీసుకొని జీవితంలో ఆచరించాలని గంగవరం తహసీల్దార్ చిన్నం శ్రీనివాసరావు, బీజేపీ నాయకులు కుంజం వెంకటేశ్వర్లు, సత్యనారాయణమ్మ పేర్కొన్నారు. అల్లూరి సీతారామరాజు 130వ జయంతి సందర్భంగా శనివారం గంగవరం తహసీల్దార్ కార్యాలయంలో ఘనంగా జయంతి వేడుకలు నిర్వహించారు. ఈ సందర్భంగా అల్లూరి సీతారామరాజు చిత్రపటానికి తహసీల్దార్ చిన్నం శ్రీనివాసరావు, బీజేపీ నాయకులు పూలమాలలు వేసి నివాళులర్పించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ, బ్రిటిష్ పాలనకు వ్యతిరేకంగా గిరిజనులను ఏకం చేసి స్వాతంత్ర్య పోరాటానికి నాయకత్వం వహించిన మహనీయుడు అల్లూరి సీతారామరాజు అని కొనియాడారు. దేశ స్వాతంత్ర్యం కోసం తన ప్రాణాలను సైతం త్యాగం చేసిన ఆయన జీవితం నేటి యువతకు స్ఫూర్తిదాయకమని పేర్కొన్నారు. అల్లూరి సీతారామరాజు గిరిజనుల హక్కులు, సంక్షేమం కోసం నిరంతరం పోరాడి వారి గుండెల్లో చిరస్థాయిగా నిలిచిపోయారని అన్నారు. ఆయన చూపిన దేశభక్తి, ధైర్యసాహసాలు, త్యాగనిరతి భావాలను ప్రతి ఒక్కరూ అలవర్చుకొని దేశాభివృద్ధికి కృషి చేయాలని పిలుపునిచ్చారు. ఈ కార్యక్రమంలో రెవెన్యూ ఇన్‌స్పెక్టర్ లక్ష్మణరావు, సొసైటీ డైరెక్టర్ నర్మల శీను, బీజేపీ జనరల్ సెక్రటరీ



అర్జున్, బీజేపీ నాయకులు, రెవెన్యూ సిబ్బంది తదితరులు పాల్గొని అల్లూరి సీతారామరాజుకు ఘనంగా నివాళులర్పించారు.

## జూలై 5న ప్రత్యేక ఇంటింటి సేకరణ కార్యక్రమం

**ప్రతి బీఎల్‌వో లక్ష్యాలను పూర్తిచేయాలి: కలెక్టర్ కె. దినేష్ కుమార్**



**రంపచోడవరం, జూలై 4 (పెన్ పవర్):** ప్రత్యేక సవరణ--2026 కార్యక్రమంలో భాగంగా జూలై 5న ప్రత్యేక ఇంటింటి సేకరణ (డోర్-టు-డోర్ కలెక్షన్ డ్రైవ్) కార్యక్రమాన్ని నిర్వహిస్తున్నట్లు జిల్లా ఎన్నికల అధికారి, జిల్లా కలెక్టర్ కె. దినేష్ కుమార్ తెలిపారు. ప్రతి బూత్ లెవల్ అధికారి (బీఎల్‌వో) తనకు కేటాయించిన లక్ష్యాలను నిర్ణీత గడువులోగా పూర్తి చేయాలని ఆయన ఆదేశించారు.

భారత ఎన్నికల సంఘం ఆదేశాలు, జిల్లా ఎన్నికల అధికారి కె. దినేష్ కుమార్ పర్యవేక్షణలో రంపచోడవరం (ఎస్టీ) శాసనసభ నియోజకవర్గంలో ప్రత్యేక సవరణ--2026 (ఎస్ఐఆర్) కార్యక్రమం వేగంగా కొనసాగుతోంది. నియోజకవర్గంలోని 399 పోలింగ్ కేంద్రాల పరిధిలో జూన్ 15 నుంచి బీఎల్‌వోలు ఇంటింటికీ వెళ్లి ఎన్యుమరేషన్ ఫారాల పంపిణీ, సేకరణ, డిజిటలైజేషన్ ప్రక్రియను చేపడుతున్నారు.

జూలై 4 నాటికి నియోజకవర్గంలోని మొత్తం 2,78,518 మంది ఓటర్లలో 2,74,212 మందికి ఎన్యుమరేషన్ ఫారాలు పంపిణీ చేయడం ద్వారా 98.45 శాతం పురోగతి సాధించారు. అలాగే 1,21,128 ఫారాలను డిజిటలైజేషన్ చేసి 43.49 శాతం పురోగతి నమోదు చేశారు. మిగిలిన ఫారాల సేకరణ, డిజిటలైజేషన్ ప్రక్రియను వేగవంతం చేసేందుకు జూలై 5న ప్రత్యేక ఇంటింటి సేకరణ కార్యక్రమాన్ని నిర్వహించనున్నట్లు అధికారులు తెలిపారు.

ఈ సందర్భంగా జిల్లా ఎన్నికల అధికారి, జిల్లా కలెక్టర్ కె. దినేష్ కుమార్ మాట్లాడుతూ ప్రత్యేక సవరణ కార్యక్రమం పూర్తయ్యే వరకు జిల్లాలోని సంబంధిత ఉద్యోగులందరి సెలవులను రద్దు చేసినట్లు తెలిపారు. ప్రతి తహసీల్దార్ తమ పరిధిలోని బీఎల్‌వోల పనితీరును నిరంతరం సమీక్షిస్తూ, డిజిటలైజేషన్‌కు అవసరమైన సంఖ్యలో పూర్తయిన ఫారాలు అందుబాటులో ఉండేలా చర్యలు తీసుకోవాలని ఆదేశించారు.

అవసరమైతే అదనపు సిబ్బందిని నియమించి ఫారాల సేకరణ, పూరణ పనులను వేగవంతం చేయాలని సూచించారు. పాస్‌పోర్టు సైజు ఫోటోలు లేని ఓటర్లకు వెంటనే ఫోటోలు తీసి, వాటిని సంబంధిత దరఖాస్తులతో సక్రమంగా అనుసంధానం చేయాలని ఆదేశించారు. ప్రతి బీఎల్‌వో తనకు కేటాయించిన లక్ష్యాలను నిర్దేశిత గడువులోగా పూర్తి చేసేలా కార్యాచరణ రూపొందించి అమలు చేయాలని సూచించారు.ఈఆర్‌వో, జాయింట్ కలెక్టర్ సూరపాటి ప్రశాంత్ కుమార్ మాట్లాడుతూ ప్రత్యేక సవరణ--2026 ప్రధాన లక్ష్యం 100 శాతం స్వచ్ఛమైన, దోషరహిత ఫోటో ఓటరు జాబితా రూపొందించడమేనని తెలిపారు. మరణించిన, శాశ్వతంగా వలస వెళ్లిన, డూప్లికేట్ నమోదులో ఉన్న ఓటర్ల పేర్ల తొలగింపు, 2026 జూలై 1 నాటికి 18 సంవత్సరాలు నిండిన అర్హులైన యువతను కొత్త ఓటర్లుగా నమోదు చేయడం, ఓటర్ల వివరాల్లోని తప్పులను సరిదిద్దడం, ఫోటోల నాణ్యతను మెరుగుపరచడం ఈ కార్యక్రమం ప్రధాన ఉద్దేశ్యాలని పేర్కొన్నారు. జూలై 5న బీఎల్‌వోలు ఇంటింటికీ వచ్చే సమయంలో ప్రజలు పూర్తిస్థాయిలో సహకరించి, ఎన్యుమరేషన్ ఫారాలు, అవసరమైన ధ్రువీకరణ పత్రాలు, ఫోటోలు అందజేసి ప్రత్యేక సవరణ కార్యక్రమాన్ని విజయవంతం చేయాలని జిల్లా ఎన్నికల అధికారి కె. దినేష్ కుమార్, ఈఆర్‌వో సూరపాటి ప్రశాంత్ కుమార్ సంయుక్తంగా విజ్ఞప్తి చేశారు.

## పాఠశాలల్లో ఐవీఆర్, లీప్ కార్యక్రమాలపై తల్లిదండ్రులకు అవగాహన





**గంగవరం, పెన్ పవర్ జూలై 4:** గంగవరం మండలంలోని పాఠశాలల్లో విద్యా ప్రమాణాల మెరుగుదలకు చేపడుతున్న కార్యక్రమాలపై తల్లిదండ్రులకు అవగాహన కల్పించేందుకు ప్రత్యేక సమావేశాలు నిర్వహించినట్లు మండల విద్యాశాఖాధికారి (ఎంఈవో-2) టి. మల్లేశ్వరరావు తెలిపారు. శనివారం గంగవరం మండలంలోని గంగవరం అశ్రమ బాలికల ఉన్నత పాఠశాల, టేకుల వీధి అశ్రమ బాలుర ఉన్నత పాఠశాల లో ఆయన పర్యటించారు. ఈ సందర్భంగా రెండు పాఠశాలల్లో విద్యార్థుల తల్లిదండ్రులతో సమావేశాలు నిర్వహించి, విద్యార్థుల అభ్యాస నైపుణ్యాల పెంపు కోసం అమలు చేస్తున్న ఐవీఆర్, లీప్ కార్యక్రమాల ప్రాముఖ్యతను వివరించారు. ఈ కార్యక్రమాల అమలులో తల్లిదండ్రులు చురుకుగా భాగస్వాములు కావాలని సూచించారు. అనంతరం పాఠశాలల్లో ఫౌండేషనల్ లిటరసీ అండ్ న్యూమరసీ (ఎఫ్ఎల్ఎన్) తరగతులను పరిశీలించిన ఎంఈవో, ఉపాధ్యాయులు కార్యకలాపాల ఆధారిత బోధన పద్ధతులను అనుసరిస్తున్నారని తెలిపారు. అలాగే విద్యార్థుల హాజరు, మధ్యాహ్న భోజన పథకం అమలు, పాఠశాలల పరిశుభ్రత తదితర అంశాలను పరిశీలించి, ప్రధానోపాధ్యాయులకు అవసరమైన సూచనలు అందించారు. విద్యార్థుల విద్యా ప్రమాణాల పెంపుతో పాటు పాఠశాలల్లో మెరుగైన వాతావరణం కల్పించేందుకు అధికారులు, ఉపాధ్యాయులు సమన్వయంతో పనిచేయాలని ఆయన సూచించారు. ఆయన వెంట ప్రధానోపాధ్యాయులు ఝాన్సీరాణి, నాగేశ్వరరావు తదితరులు ఉన్నారు.

## మండల ప్రజా పరిషత్ కార్యాలయం లో అల్లూరి జయంతి



**రాజమహేంద్రవరం, పెన్ పవర్, జూలై 4:** విప్లవ వీరుడు అల్లూరి సీతారామరాజు జయంతి పురస్కరించుకొని రూరల్ మండల ప్రజా పరిషత్ కార్యాలయం లో అల్లూరి సీతారామరాజు చిత్రపటానికి రూరల్ ఎమ్మెల్యే గోరంట్ల బుచ్చయ్య చౌదరి పూలమాలలు వేసి ఘనంగా నివాళులర్పించారు.


అనంతరం ఎమ్మెల్యే గోరంట్ల అధ్యక్షతన రూరల్ మండలంలోని గ్రామాల్లో తాగునీటి సరఫరా, పారిశుధ్యం, డ్రైనేజీ, ఘన వ్యర్థాల నిర్వహణ తదితర అంశాలపై సమీక్ష సమావేశం నిర్వహించారు. గ్రామాల్లో గుర్తించిన సమస్యలను ప్రాధాన్యత క్రమంలో వెంటనే పరిష్కరించాలని అధికారులను ఆదేశించారు.

డ్రైనేజీలను శుభ్రపరచాలని, ఘన వ్యర్థాల సేకరణను సమర్థవంతంగా నిర్వహించాలని, శాఖల మధ్య సమన్వయంతో ప్రజలకు మెరుగైన సేవలు అందించాలని సూచించారు.

ఈకార్యక్రమంలో ఎంపీడీవో సునీల్ ఆర్మ్‌స్ట్రాంగ్, డిప్యూటీ ఎంపీడీఓ బొడ్డు అమ్మిరాజు, ఆర్డబ్ల్యూఎస్ డి.ఈ శ్రీనివాస్, పంచాయతీరాజ్ ఏ.ఈ సంపత్ కుమార్, పంచాయతీ కార్యదర్శులు, ఇంజినీరింగ్ శాఖ అధికారులు, ఎంజీఎన్ఆర్ఈజీఎస్, హౌసింగ్ సంబంధిత శాఖల అధికారులు పాల్గొన్నారు

## వంగవీటి ఆశయాలను ముందుకు తీసుకువెళ్లాలి.

**రంగా మిత్రమండలి సభ్యులు**





**గోకవరం పెన్ పవర్ జులై 04:**--కీర్తిశేషులు ప్రజా నాయకుడు వంగవీటి మోహన రంగా ఆశయాలను మనం ముందుకు తీసుకెళ్లి సమాజంలో ఒక స్థాయికి ఎదగాలని అదే మనం వంగవీటి మోహనరంగాకు అర్పించే నివాళి అని మండలంలోని రంపఎర్రంపాలెం గ్రామ వంగవీటి మోహన రంగా మిత్రమండలి యువకులు పిలుపు నిచ్చారు. శనివారం పల్లపు వీధి రామాలయం వద్ద ఉన్న వంగవీటి మోహన రంగా విగ్రహానికి పూలమాలలు వేసి మోహనరంగా 79వ జయంతి వేడుకలు ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా గ్రామంలోని వంగవీటి మోహన రంగా మిత్రమండలి యువకులు పలు సేవా కార్యక్రమాలు చేపట్టి వంగవీటి మోహన రంగా ను ఆదర్శంగా తీసుకుని మనమంతా ఎదగాలని పలు సామాజిక సేవా కార్యక్రమాల్లో ముందుండాలని పిలుపునిస్తూ వంగవీటి మోహనరంగా విగ్రహానికి పూలమాలలు వేసి వంగవీటి మోహనరంగా జోహార్ వంగవీటి జోహార్ జోహార్ అంటూ నినాదాలు చేశారు. వంగవీటి మోహనరంగ 79 వ జయంతి సందర్భంగా నివాళులు అర్పించినవారిలో గంట తేజ,చిక్కిరెడ్డి వీరబాబు, బోయిడి సుబ్బు,దేవరపు దుర్గాప్రసాద్,పంతం సాయి, బోయిడి సాయి,బోయిడి దత్తు,అయినాల కృష్ణ తదితర అనేకమంది వంగవీటి రంగా మిత్రమండలి సభ్యులు పాల్గొన్నారు.

## రూ.3.20 కోట్లతో ప్రభుత్వ హోమియోపతి వైద్య కళాశాల అభివృద్ధి పనులకు శంకుస్థాపన




**రాజమహేంద్రవరం, పెన్ పవర్ జూలై 4**

అల్లు రామలింగయ్య ప్రభుత్వ హోమియోపతి మెడికల్ కళాశాలలో నేషనల్ ఆయుష్ మిషన్ ఆధ్వర్యంలో రూ.3.20 కోట్ల వ్యయంతో చేపట్టనున్న అభివృద్ధి పనులకు ఎమ్మెల్యే ఆదిరెడ్డి శ్రీనివాస్ తో కలిసి ఎంపీ పురందరేశ్వరి శంకుస్థాపన చేసారు. ఈ నిధులతో నూతన అడ్మినిస్ట్రేటివ్ బ్లాక్, మినీ ఆడిటోరియం, లిఫ్ట్ , తరగతి గదుల పునరుద్ధరణ, విద్యుత్ వ్యవస్థ ఆధునీకరణ, మహిళా విద్యార్థుల కోసం ప్రత్యేక టాయిలెట్ బ్లాక్, సెక్యూరిటీ రూమ్, ప్రహరీ గోడ నిర్మాణం కీలక మౌలిక సదుపాయాలు అభివృద్ధి చేయనున్నారు. గతంలో 23 పీజీ సీట్లు రద్దయ్యే పరిస్థితి ఏర్పడినప్పుడు, కేంద్ర--రాష్ట్ర స్థాయిలో పీజీ సీట్లను పునరుద్ధరించగలిగామన్నారు విద్యార్థులకు నాణ్యమైన వైద్య విద్య, ఆధునిక వసతులు అందేలా కృషి చేస్తూన్నామన్నారు.

# రామవరంలో రైతులకు రాజముద్ర పాస్ పుస్తకాలు పంపిణీ

**జగ్గంపేట, పెన్ పవర్, జూలై 4:** ప్రభుత్వ వ్యవస్థలపై ప్రజలకు నమ్మకం కలిగించేలా, పూర్తి పారదర్శకతతో రైతులకు రాజముద్రతో కూడిన పాస్ పుస్తకాలను అందజేస్తున్నామని జగ్గంపేట ఎమ్మెల్యే, టీడీపీ పొలిట్ బ్యూరో సభ్యుడు జ్యోతుల నెహ్రూ అన్నారు. జగ్గంపేట మండలం రామవరం గ్రామంలో శనివారం రైతులకు రాజ్యముతో కూడిన పట్టాదారు పాస్ పుస్తకాలు పంపిణీ కార్యక్రమంలో 1408 మంది రైతులకు నూతన పాస్ పుస్తకాలను ఆయన చేతుల మీదుగా పంపిణీ చేశారు. రాష్ట్ర తెలుగు యువత ఉపాధ్యక్షులు అడబాల వెంకటేశ్వరరావు అధ్యక్షతన జరిగిన ఈ కార్యక్రమంలో మొత్తం 1643 పాస్ పుస్తకాలకు గాను 1408 పంపిణీ పూర్తయింది. మిగిలిన 235 పుస్తకాలను సాంకేతిక కారణాల పరిశీలన అనంతరం వారం రోజుల్లో అందిస్తామని తహసీల్దార్ జేవిఆర్ రమేష్ తెలిపారు. ఎమ్మెల్యే జ్యోతుల నెహ్రూ మాట్లాడుతూ ప్రభుత్వ పథకాలు, పత్రాలు వ్యక్తి కేంద్రంగా కాకుండా వ్యవస్థ కేంద్రంగా ఉండాలి. రాజముద్ర అనేది వ్యవస్థకు చిహ్నం. అందుకే ఈ మార్పు అన్నారు. గత ప్రభుత్వ హయాంలో పాస్ పుస్తకాలపై జగన్ తన వ్యక్తిగత ఫోటోలు ముద్రించి, ల్యాండ్ టైటిలింగ్ చట్టం పేరుతో రైతాంగంలో అభద్రత సృష్టించారు. దాని ఫలితాన్ని ప్రజలు ఎన్నికల్లో చూపించారు. ముఖ్యమంత్రి చంద్రబాబు నాయుడు విధానం స్పష్టం – రైతు భూమికి సంపూర్ణ రక్షణ, ప్రభుత్వ పరంగా పూర్తి భరోసా. అందులో భాగమే




ఈ రాజముద్ర పాస్ పుస్తకాలు అన్నారు. ఈ కార్యక్రమంలో ఎస్వీఎస్ అప్పలరాజు, రాష్ట్ర డైరెక్టర్లు కొత్త కొండబాబు, పోతుల మోహనరావు, ఎమ్మార్వో జేవియర్ రమేష్, జిల్లా దివ్యాంగుల అధ్యక్షులు మండపాక అప్పన్న దొర, మాజీ సర్పంచ్ మండపాక చిన్న, జనసేన ఎంపీటీసీ దొడ్డ శ్రీను, మండల జనసేన యువత అధ్యక్షులు మొగిలి గంగాధర్ జగ్గంపేట ఆర్ఐ జి మంగపతి నాయుడు బాబు, టీడీపీ, జనసేన నాయకులు, అధికారులు, పెద్ద సంఖ్యలో రైతులు పాల్గొన్నారు.

Printed by Published by GANTYADA APPARAO on behalf of GANTYADA APPARAO, printed at printed at SRI SAI GANGA PRINTERS AND PUBLISHERS FLAT NO: 504, Bharat Towers, 5th lane, Dwaraka Nagar, Visakhaptanam, Andhrapradesh-530016, and published at Flat No F2, Nihar towers, Srinagar, kakinada, kakinada District, Andhrapradesh -533003 Editor: GANTYADA APPARAO. Mobile : 9059465965, RNI : APTEL/2017/73154 , editorpenpower@gmail.com

# ఢిల్లీలో రూ.105 కోట్లతో సరికొత్త ఏపీ భవన్..!

**విజయవాడ, జూలై 4, పెన్ పవర్:** దేశ రాజధాని న్యూఢిల్లీలో ఆంధ్రప్రదేశ్ రాష్ట్ర ప్రతిష్టను చాటేలా సరికొత్త ఏపీ భవన్ నిర్మాణానికి రంగం సిద్ధమైంది. విభజన అనంతరం సుదీర్ఘ కాలంగా పెండింగ్‌లో ఉన్న ఈ భవన నిర్మాణ ప్రక్రియను కూటమి ప్రభుత్వం వేగవంతం చేసింది. అక్షరాలా రూ.105 కోట్ల భారీ బడ్జెట్‌తో ఈ నూతన భవనాన్ని నిర్మించనున్నారు. ఢిల్లీకి వచ్చే రాష్ట్ర పౌరులకు, ప్రజాప్రతినిధులకు మరియు అధికారులకు అత్యుత్తమ సేవలు అందించేలా, అన్ని రకాల అత్యాధునిక వసతులతో ఈ ప్రాజెక్టును డిజైన్ చేశారు. ఈ నూతన ఏపీ భవనాన్ని సుమారు 2.5 లక్షల చదరపు అడుగుల భారీ విస్తీర్ణంలో నిర్మించనున్నారు. ఇది కేవలం ఒక అతిథి గృహంగానే కాకుండా, ఢిల్లీలో ఆంధ్రప్రదేశ్ ప్రభుత్వానికి సంబంధించిన పూర్తి స్థాయి పరిపాలన మరియు ఆతిథ్య కేంద్రంగా సేవలందించనుంది. రాష్ట్ర ప్రభుత్వానికి సంబంధించిన దౌత్యపరమైన సమావేశాలు, పారిశ్రామికవేత్తలతో చర్చలు, మరియు సాంస్కృతిక కార్యక్రమాలను ఘనంగా నిర్వహించుకునేలా ఇందులో కాన్ఫరెన్స్ హాళ్లు, వీఐపీ లాంజ్‌లు మరియు ప్రత్యేక కార్యాలయాలను ఏర్పాటు చేయనున్నారు. ఈ ప్రతిష్టాత్మక భవన నిర్మాణ బాధ్యతలను కేంద్ర ప్రభుత్వ రంగ సంస్థ అయిన 'నేషనల్ బిల్డింగ్స్ కన్స్ట్రక్షన్ కార్పొరేషన్' కి ఆంధ్రప్రదేశ్ ప్రభుత్వం అప్పగించింది. ప్రభుత్వ నిర్మాణ రంగంలో అంతర్జాతీయ ప్రమాణాలతో భవనాలను నిర్మించడంలో ఎన్‌బీసీసీకి మంచి గుర్తింపు ఉంది. ఈ కేంద్ర సంస్థ ఆధ్వర్యంలో ఎలాంటి లోపాలు లేకుండా, నిర్ణీత కాలవ్యవధిలోనే అత్యంత నాణ్యతతో కూడిన హంగులతో ఈ నూతన ఏపీ భవన్ నిర్మాణం పూర్తి కానుంది. ఉమ్మడి ఆంధ్రప్రదేశ్ విభజన జరిగిన 12 ఏళ్ల తర్వాత, ఢిల్లీలోని ఏపీ భవన్ ఆస్తుల పంపిణీకి సంబంధించి తెలంగాణ ప్రభుత్వంతో సాగిన సుదీర్ఘ వివాదానికి కూటమి ప్రభుత్వం స్వస్తి పలికింది. ఇరు రాష్ట్రాల మధ్య కుదిరిన చారిత్రాత్మక ఒప్పందం ప్రకారం.. ఏపీ వాటాగా వచ్చిన భూమిలోనే ఈ సరికొత్త భవనాన్ని నిర్మిస్తున్నారు.

03
ఇప్పుడు పెన్ పవర్ దిన పత్రికలో
కోర్టు పబ్లికేషన్ యాడ్స్
కేవలం
యాడ్ 500/-
'పొ. 12 సెం.మీ, వె. 8 సెం.మీ'
'మరిన్ని వివరాలకు సంప్రదించండి '
93948 55244
షరతులు వర్తిస్తాయి

## రాజధాని చుట్టూ మరోసారి రగడ..

**విజయవాడ, జూలై 4, పెన్ పవర్:** ఆంధ్రప్రదేశ్ రాజధాని అమరావతి అంశం మరోసారి రాష్ట్ర రాజకీయాల్లో ప్రధాన చర్చగా మారింది. రాజధాని అభివృద్ధిని వేగవంతం చేయాలనే లక్ష్యంతో రాష్ట్ర ప్రభుత్వం ముందుకు సాగుతుండగా, ప్రతిపక్షం నుంచి వస్తున్న రాజకీయ వ్యాఖ్యలు కొత్త చర్చలకు దారితీస్తున్నాయి. ముఖ్యంగా రాజధాని భవిష్యత్తుపై వస్తున్న ప్రకటనలు పెట్టుబడిదారులు, వ్యాపార వర్గాలు, ప్రజల్లో ఆసక్తిని పెంచుతున్నాయి. ముఖ్యమంత్రి నారా చంద్రబాబు నాయుడు ) అమరావతిని ప్రపంచ స్థాయి నగరంగా తీర్చిదిద్దాలని లక్ష్యంగా పెట్టుకున్నారు. గతంలో నిలిచిపోయిన అనేక అభివృద్ధి పనులను తిరిగి ప్రారంభించడంతో పాటు, దేశీయ, విదేశీ పెట్టుబడులను ఆకర్షించే ప్రయత్నాలు ప్రభుత్వం కొనసాగిస్తోంది. మౌలిక సదుపాయాలు, ప్రభుత్వ కార్యాలయాలు, వాణిజ్య కేంద్రాలు, విద్యా సంస్థల అభివృద్ధిపై ప్రత్యేక దృష్టి సారిస్తోంది. అయితే ఇటీవల వైఎస్సార్ కాంగ్రెస్ పార్టీ అధ్యక్షుడు వైఎస్ జగన్ మోహన్ రెడ్డి చేసిన "మావిగన్" వ్యాఖ్యలు రాజకీయ వర్గాల్లో కొత్త చర్చకు కారణమయ్యాయి. ఈ ప్రకటనతో రాజధాని అంశం మరోసారి ప్రధాన రాజకీయ అజెండాగా మారింది. ఈ పరిణామాలు అమరావతి అభివృద్ధిపై ప్రభావం చూపే అవకాశం ఉందని కొందరు రాజకీయ విశ్లేషకులు అభిప్రాయపడుతున్నారు. ముఖ్యంగా పెట్టుబడుల విషయంలో అనిశ్చితి నెలకొనే అవకాశం ఉందని కొందరు భావిస్తున్నారు. ప్రస్తుతం అమరావతిలో పరిశ్రమలు, ఐటీ సంస్థలు, వ్యాపార సంస్థలు పెట్టుబడులపై ఆసక్తి చూపుతున్నాయి. కానీ రాజధానిపై తరచూ రాజకీయ వివాదాలు కొనసాగితే కొంతమంది పెట్టుబడిదారులు నిర్ణయాలు వాయిదా వేసే పరిస్థితి ఏర్పడవచ్చని పరిశీలకులు చెబుతున్నారు. పెట్టుబడులకు స్థిరమైన వాతావరణం చాలా అవసరమని వారు సూచిస్తున్నారు. రియల్ ఎస్టేట్ రంగంపై కూడా ఈ తరహా రాజకీయ చర్చల ప్రభావం ఉండొచ్చని అభిప్రాయాలు వ్యక్తమవుతున్నాయి. గతంలో రాజధాని అంశంపై వచ్చిన వివిధ నిర్ణయాల కారణంగా నిర్మాణ రంగం మందగించిన పరిస్థితులు కనిపించాయి. ప్రస్తుతం తిరిగి నిర్మాణ కార్యకలాపాలు వేగం పుంజుకుంటున్న సమయంలో మరోసారి అనిశ్చితి ఏర్పడితే అభివృద్ధి ప్రాజెక్టులపై ప్రభావం పడే అవకాశాన్ని కొందరు ప్రస్తావిస్తున్నారు. అమరావతి పరిసర ప్రాంతాల్లో వ్యాపార కార్యకలాపాలు కూడా క్రమంగా విస్తరిస్తున్నాయి. కొత్త సంస్థలు, సేవా రంగ సంస్థలు, వాణిజ్య కార్యకలాపాలు ప్రారంభమవుతున్నాయి. ఇలాంటి సమయంలో రాజకీయ ప్రకటనలు వ్యాపార నిర్ణయాలపై ప్రభావం చూపకుండా ప్రభుత్వం విశ్వాసాన్ని పెంపొందించాల్సిన అవసరం ఉందని ఆర్థిక నిపుణులు సూచిస్తున్నారు. ఈ నేపథ్యంలో ప్రభుత్వం పెట్టుబడిదారులు, పారిశ్రామికవేత్తలు, ప్రజల్లో నమ్మకాన్ని మరింత బలపరిచే చర్యలు చేపట్టాల్సిన అవసరం ఉందని విశ్లేషకులు అభిప్రాయపడుతున్నారు. అభివృద్ధి కార్యక్రమాలు నిరంతరంగా కొనసాగుతున్నాయనే సందేశాన్ని స్పష్టంగా చేరవేయడం, రాజధాని నిర్మాణంపై దీర్ఘకాలిక ప్రణాళికలను ప్రజలకు వివరించడం కూడా కీలకమని చెబుతున్నారు. మొత్తంగా చూస్తే అమరావతి అంశం కేవలం రాజకీయ చర్చకు మాత్రమే పరిమితం కాకుండా రాష్ట్ర ఆర్థికాభివృద్ధి, పెట్టుబడులు, ఉపాధి అవకాశాలతో ముడిపడి ఉంది. అందువల్ల రాజకీయ విభేదాల కంటే అభివృద్ధి, స్థిరత్వం, ప్రజల విశ్వాసానికి ప్రాధాన్యం ఇచ్చే నిర్ణయాలే రాష్ట్ర భవిష్యత్తుకు మరింత ఉపయోగకరమని పలువురు అభిప్రాయపడుతున్నారు.

**విజయసాయిరెడ్డి సలహాలు**

ఆంధ్రప్రదేశ్‌లో అమరావతి వర్సెస్ మావిగన్ చర్చ తెరపైకి వచ్చింది. 2029 ఎన్నికల్లో మావిగన్ ఎజెండాతో ప్రజల్లోకి వెళతామని మాజీ ముఖ్యమంత్రి వైఎస్ జగన్ వ్యాఖ్యలతో రాజకీయాలు ఆసక్తికరంగా మారాయి. కూటమి పార్టీలు కూడా అప్పుడు మూడు రాజధానులు, ఇప్పుడు మావిగన్ పేరుతో ప్రజల్ని మోసం చేస్తున్నారని జగన్‌కు కౌంటర్ ఇస్తున్నాయి. తాజాగా అమరావతి వర్సెస్ మావిగన్ అంశంపై మాజీ ఎంపీ విజయసాయిరెడ్డి స్పందించారు. ఈ రెండు అంశాలపై తన అభిప్రాయాలను చెప్పుకొచ్చారు. టీడీపీ ఆంధ్రప్రదేశ్ రాజధాని అమరావతి మాత్రమేనని చెబుతోందని.. వైఎస్సార్‌సీపీ మావిగన్ అంటోందని.. ఒక బాధ్యత కలిగిన ఒక పౌరుడిగా రెండు రాజకీయపార్టీలు చేస్తున్న భిన్న అర్థరహిత వాదనలు చూసిన తర్వాత తన అభిప్రాయాలను అందరితో పంచుకుంటున్నాను అన్నారు. ఆంధ్రప్రదేశ్ రాజధానిని ఎక్కడ ఏర్పాటుచేయాలనే అంశంపై గతంలో శివరామకృష్ణన్ కమిటీ ఇచ్చిన నివేదికను వీరంతా ఎందుకు పక్కన పెట్టారని ప్రశ్నించారు విజయసాయిరెడ్డి. 2014లో రాష్ట్ర విభజన జరిగిందని.. 12 ఏళ్లు అవుతున్నా సరే ఇంకా రాజధాని ఎక్కడ ఉండాలనే చర్చ జరుగుతోందని.. ఇది అందరూ సిగ్గుపడాల్సిన విషయమన్నారు. రాష్ట్రం విడిపోయిన 15 ఏళ్ల తర్వాత.. అంటే 2029లో మరోసారి సార్వత్రిక ఎన్నికలు రానున్నాయని.. ఆ ఎన్నికల్లో కూడా రాజధాని ఎక్కడ ఉండాలో ప్రజలు మరోసారి నిర్ణయించాలా అంటూ ప్రశ్నించారు. రాష్ట్రంలో రాజధాని పేరుతో చేస్తున్న ఈ పొలిటికల్ ఫుట్‌బాల్ మ్యాచ్‌ను ఆపేయాల్సిన బాధ్యత అన్ని పార్టీల మీదా ఉందా? లేదా? అన్నారు. అమరావతిలో మొదటి విడతలో ల్యాండ్ పూలింగ్‌కు రైతులకు భూములు ఇచ్చారని.. కానీ ఇప్పటికీ వారికి ప్లాట్లు అప్పగించలేదని, అసలు కేటాయింపులు చేయలేదని.. దీనిని ఎలా సమర్థించుకుంటారని.. లక్ష ఎకరాలు రాజధానికి ఏం చేసుకుంటారని ప్రశ్నించారు విజయసాయిరెడ్డి. వీజీటీఎం కాన్సెప్ట్ (విజయవాడ--గుంటూరు--తెనాలి--మంగళగిరి) విభజన చట్టంలోనే ఉందని.. ఈ ప్రాంతం అంతటికీ రాజధాని భవనాలను విస్తరిస్తే అందులో పోయేది ఏం ఉంటుందని ప్రశ్నించారు విజయసాయి. ప్రధానంగా రాజధాని నిర్మాణం పేరుమీద అవినీతి జరుగుతోందని.. కూటమి ప్రభుత్వం రాజధాని కోసం ఏకంగా రూ.50 వేల కోట్లు ఖర్చు చేస్తోందన్నార విజయసాయి. అమరావతిలో జరుగుతున్న ప్రతి నిర్మాణంలో భారీగా నిర్మాణ వ్యయాన్ని పెంచి చూపించారని ఆరోపించారు. దీన్ని బట్టి రాజధానిలో అవినీతికి పథకం వేస్తున్నారని.. అందుకే అమరావతి అనే అందమైన పేరు పెట్టారన్నారు. అమరావతిని దేవతల రాజధాని అంటూ బ్రహ్మాండమైన అబద్ధపు బ్రాండింగ్ ఇచ్చారన్నారు. నేరుగా అధికారంలో ఉన్న వారు ఈ దేవతల రాజధాని బ్రాండింగ్ వాడుకుంటూ 25 నుంచి 30 శాతం డబ్బును లంచాలుగా తీసుకుంటున్నారని ఆరోపించారు. వాస్తవానికి అమరావతిలో ఉన్న అమరేశ్వరుడి ఆలయం, బుద్ధ విగ్రహం ఉన్న అమరావతికి.. ఇప్పుడు నిర్మాణం చేస్తున్న బిల్డింగులు ఉన్న ప్రాంతం 50 కిలోమీటర్ల దూరంలో ఉందన్నారు. అమరావతి దైవ క్షేత్రం, కృష్ణమ్మ ప్రవహిస్తున్న క్షేత్రం అయితే.. ఈ అమరావతి అవినీతి పారుతున్న క్షేత్రం అని ఘాటుగా స్పందించారు.'అమరావతి బిల్డింగుల నిర్మాణానికి ఏకంగా రూ 50 వేల కోట్లు ఖర్చు చేస్తున్నప్పుడు అందులో 25--30 శాతం అవినీతికి ఆస్కారం కనిపిస్తున్నప్పుడు.. ఈ అవినీతిని మనమంతా ప్రజలుగా మొదట ప్రశ్నించాలి. అంటే ఇది దాదాపు 15 వేల కోట్ల లంచాల మేతకు వేసిన పథకం. మరి ఈ విషయాన్ని వదిలేసి మావిగన్ అనటం వల్ల ప్రయోజనం ఏమిటి? మరో మూడేళ్ళలో జరిగిపోయే నిర్మాణాలన్నీ ఏం చేద్దాం? రాజధానిని నిర్మించటం అంటే అవినీతికి బాగా ఆస్కారం ఉన్న బిల్డింగులు ఏ పార్టీ కట్టాలి... ఎంత కమీషన్లు కొట్టాలి అన్నది కాదు కదా?. కాబట్టి, అమరావతి పేరిట జరుగుతున్న అవినీతి యజ్ఞాన్ని ప్రజలందరి తరఫున ప్రశ్నిస్తూ, ఎస్కలేషన్‌కు సంబంధించిన పూర్తి వివరాలతో అవినీతిని సవాలు చేస్తూ త్వరలో న్యాయస్థానాన్ని ఆశ్రయిస్తాను' అంటూ విజయసాయిరెడ్డి ట్వీట్ చేశారు.

## మాడుగుల హల్వా కావాలా...వైసీపీ ఏం చేయాలంటే ?



**హైదరాబాద్ పెన్ పవర్:** అనకాపల్లి జిల్లాలో కీలకమైన సీటుగా మాడుగుల అసెంబ్లీ నియోజకవర్గం ఉంది. ఈ సీటు గొప్పతనం ఏంటి అంటే టీడీపీకి దశాబ్దాలుగా కట్టుబడిపోయింది. టీడీపీ ఆవిర్భవించాక ఏడు సార్లు మాడుగులలో టీడీపీ గెలిచింది. అందులో అయిదు సార్లు రెడ్డి సత్యనారాయణ ఎమ్మెల్యేగా గెలిచి ఎన్టీఆర్ ప్రభుత్వంలో మంత్రిగా పనిచేశారు. టీడీపీ ముందు కూడా కాంగ్రెస్ రెండు సార్లు గెలిచింది. ప్రతిపక్షాలు ఇండిపెండెంట్లు ఈ సీట్లో గెలుస్తూ వచ్చారు. ఇక 32 ఏళ్ళ సుదీర్ఘ కాలం తరువాత 2004లో కాంగ్రెస్ మాడుగులలో గెలిచింది. మళ్ళీ 2009లో టీడీపీ గెలిచింది. 2014, 2019లలో వైసీపీ తరఫున బూడి ముత్యాలనాయుడు గెలిచారు. 2024లో మళ్ళీ టీడీపీ జెండా ఎగరేసింది.

**బూడి గట్టిగానే పట్టు :**

ఇక బూడి ముత్యాలనాయుడు జెడ్పీటీసీ నుంచి నేరుగా ఎమ్మెల్యే అయ్యారు. గ్రౌండ్ లెవెల్ లో ఆయనకు మంచి పట్టు జనంతో కలసి తిరగడం స్థానిక సమస్యల మీద అవగాహన వంటివి ఆయనను రెండు సార్లు ఎమ్మెల్యేగా చేసాయి. సామాన్యుడిగా వ్యవహరించడం కూడా ఆయనకు కలసి వచ్చిన మరో అంశం. ఇక 2024లో కూడా ఎమ్మెల్యేగా వరసగా గెలిచి హ్యాట్రిక్ కొట్టాలని బూడి అనుకుంటున్న నేపధ్యంలో సడెన్ గా ఆయన్ని అనకాపల్లి ఎంపీగా జగన్ నిలబెట్టి ఆయన కుమార్తె జెడ్పీటీసీ అయిన బూడి అనూరాధకు మాడుగుల ఎమ్మెల్యే టికెట్ ఇచ్చారు. దాంతో తండ్రీ కుమార్తె ఇద్దరూ ఓటమి పాలు అయ్యారు.

**ఈసారి చాన్స్ ఉందా :**

ఇక మాడుగులలో చూస్తే టీడీపీ నుంచి మాజీ మంత్రి బండారు సత్యనారాయణమూర్తి ఎమ్మెల్యేగా ఉన్నారు. ఆయన సీనియర్ నేత. అయినప్పటికీ ఆయన చూపు ఎక్కువగా పెందుర్తి మీద ఉంది. అది ఆయన సొంత సీటు దాంతో 2029 లో తన కుమారుడిని అక్కడ నిలబెట్టి రాజకీయ వారసుడిగా తీర్చిదిద్దాలని చూస్తున్నారు. మాడుగుల టీడీపీలో మాజీ ఎమ్మెల్యే గవిరెడ్డి రామానాయుడు ఉన్నారు. అలాగా ఇతర నేతలు కూడా ఉన్నారు. వీరంతా ఎవరికి వారుగా వచ్చే ఎన్నికల్లో సీటు కోసం ప్రయత్నం చేస్తున్నారు. మాడుగులలో టీడీపీ పరిస్థితి ఇలా ఉంటే వైసీపీ విషయం తీసుకుంటే బూడి నెమ్మదించారు అని అంటున్నారు.

**జగన్ దిశా నిర్దేశం :**

ఇటీవల తాడేపల్లి వెళ్ళిన బూడి ఆయన కుమార్తె అనూరాధలకు పార్టీని పటిష్టం చేయమని జగన్ దిశా నిర్దేశం చేశారు అని అంటున్నారు. టీడీపీకి బలమైన స్థావరంగా ఉన్న మాడుగులలో గెలవడం అంటే వైసీపీకి కత్తి మీద సాము అని అంటున్నారు. పార్టీ బాగా యాక్టివ్ కావాల్సి ఉందని అంటున్నారు. అంతే కాదు బూడి ముత్యాలనాయుడు వచ్చే ఎన్నికల్లో ఎమ్మెల్యే అభ్యర్థి అయితేనే వైసీపీకి మళ్ళీ పూర్వ వైభవం వస్తుందని అంటున్నారు. అయితే ఆయన తన కుమార్తె అనూరాధకు టికెట్ ఇప్పించుకోవాలని చూస్తున్నారు అని అంటున్నారు. అందుకే ఆయన రాజకీయంగా కొంత చురుకు తగ్గించారు అని కూడా అంటున్నారు. అయితే జనాల్లో మాత్రం బూడి పట్ల అభిమానం సానుభూతి ఉన్నాయని ఆయన కనుక పోటీకి దిగితే టీడీపీకి టఫ్ గా ఉంటుందని అంటున్నారు. ఆయన ప్లేస్ లో కుమార్తెని నిలబెడితే మాత్రం సైకిల్ స్పీడ్ అందుకుంటుందని కూడా అంటున్నారు. మరి ఈ విషయంలో వైసీపీ అధినాయకత్వం ఎలా ఆలోచిస్తుంది అన్నది చూడాల్సి ఉంది అని అంటున్నారు. మాడుగుల హల్వా కావాలంటే వైసీపీ చేయాల్సింది బోలెడు ఉందని కూడా సూచనలు వస్తున్నాయి.

# మారుతోన్న రాయలసీమ

**కర్నూలు, జూలై 4, పెన్ పవర్:** రాయలసీమ నుంచి ఎంతోమంది ముఖ్యమంత్రులు వచ్చారు. రాయలసీమ కేంద్రంగా ఎందరో రాజకీయాలు చేశారు. కానీ ఆ స్థాయిలో రాయలసీమ మాత్రం అభివృద్ధి చెందలేదు. కానీ కూటమి వచ్చిన తరువాత రాయలసీమ రూపురేఖలు మారుతున్నాయి. దశాబ్దాలుగా కేవలం కాగితాలకే పరిమితమై, రాజకీయ శంకుస్థాపనల డ్రామాతో విసిగిపోయిన కడప స్టీల్ ప్లాంట్ వ్యవహారంలో ఎట్టకేలకు ఒక బలమైన ముందడుగు పడింది. కడప స్టీల్ ప్లాంట్ కు శ్రీకారం చుట్టనున్నారు. ఇది కేవలం కొబ్బరికాయలు కొట్టే మరో సాంప్రదాయక భూమి పూజ కాదు. పక్కాగా నిర్మాణ పనుల ప్రారంభోత్సవం. జిందాల్ ఆధ్వర్యంలో గ్రీన్ స్టీల్ ప్లాంట్ తొలి దశ ఉత్పత్తిని అత్యంత వేగంగా అందుబాటులోకి తెచ్చేలా ఒక లక్ష్యాన్ని పెట్టుకున్నారు. ఇది నిజంగా రాయలసీమ చరిత్రలో సువర్ణ అధ్యాయం. ఒకప్పుడు ఫ్యాక్షన్ రాజకీయాలతో వివాదాల మయంగా మారిన రాయలసీమ.. ఇప్పుడు పారిశ్రామికంగా.. రాయల పరిశ్రమల సీమగా రూపాంతరం చెందుతూ ఉండడం శుభపరిణామం. ఉత్పత్తి రంగానికి సంబంధించిన పరిశ్రమలు రాయలసీమలో ఏర్పాటు అవుతున్నాయి. అయితే ఈ ప్రాంతాన్ని పారిశ్రామికంగా నిలబెట్టడంలో శ్రీ సిటీ కీలక పాత్ర పోషించింది. గ్లోబల్ కంపెనీలకు క్యారాఫ్ అడ్రస్ గా మారింది. గత కొన్ని సంవత్సరాలుగా ఇక్కడ జరుగుతున్న పరిశ్రమల జాతర ఒక ఎత్తు అయితే.. ఇటీవల ఆటోమొబైల్, ఎలక్ట్రానిక్ రంగాల్లో వచ్చిన పెట్టుబడులు మరో ఎత్తు. రాయల్ ఎన్ఫీల్డ్, హీరో మోటో కార్ప్ వంటి దిగ్గజ సంస్థలు రాయలసీమలో వేల కోట్ల రూపాయల పెట్టుబడులతో తమ ప్లాంట్లను నిర్మించాయి. వేలాదిమంది స్థానిక యువతకు, గ్రామీణ మహిళలకు ఉపాధి కల్పించాయి. గతంలో వచ్చిన కియా మోటార్స్ అనంతపురం జిల్లాలో పెద్ద ఎత్తున ఉద్యోగాలు కల్పించింది. అయితే ప్రస్తుతం శ్రీ సిటీ ఉమ్మడి చిత్తూరు జిల్లా పారిశ్రామిక వైభవానికి సరికొత్త కేంద్రంగా మారింది. అన్నింటికీ మించి రాయలసీమ గ్రీన్ ఎనర్జీ రంగంలో దేశంలోనే టాప్ హబ్ గా మారింది. కర్నూలు, నంద్యాల జిల్లాలో గ్రీన్ కో, ఆర్సలర్ మిట్టల్, ఐర్ఈడిఏ భాగస్వామ్యంతో ప్రపంచంలో అతిపెద్ద ఇంటిగ్రేటెడ్ రెన్యువబుల్ ఎనర్జీ స్టోరేజ్ ప్రాజెక్టులు వేగం గా రూపుదిద్దుకుంటున్నాయి. గతంలో వెనుకబడిన ప్రాంతంగా.. కరువు సీమగా ముద్రపడిన రాయలసీమ.. ఇప్పుడు పరిశ్రమలకు స్వర్గధామంగా మారింది. అటు బెంగళూరు ఐటి, ఆటోమొబైల్ క్యారీడర్.. ఇటు చెన్నై పోర్టులకు కనెక్టివిటీ ఉండడంతో రాయలసీమ కు ప్లస్ పాయింట్ గా నిలుస్తోంది. ప్రధానంగా ఖనిజ సంపద, ఇనుప ఖనిజం, సున్నపురాయి నిల్వలు భారీ సిమెంట్, స్టీల్ పరిశ్రమలకు బలమైన పునాదులుగా మారాయి. బలమైన రాజకీయ సంకల్పం, స్థిరమైన పారిశ్రామిక విధానాలతో కూటమి ప్రభుత్వం ముందుకు వెళు తుండడంతో రాయలసీమ పారిశ్రామిక అభివృద్ధి సాధ్యం అవుతుంది.

**మంటపెట్టిన జిందాల్ ట్వీట్**

ఆంధ్రప్రదేశ్ రాజకీయాలు ఎప్పుడు ఏ టర్న్ తీసుకుంటాయో ఊహించడం చాలా కష్టం. నిన్నటి వరకూ ఓ లెక్కన సాగిన రాజకీయం.. నేటి ఉదయానికి మరోలా మారిపోతుంది. అధికార టీడీపీ కూటమి, విపక్ష వైఎస్సార్ కాంగ్రెస్ పార్టీ మధ్య సాగుతున్న పొలిటికల్ వార్‌లో.. "క్రెడిట్" అనే అంశం చాలా కీలకంగా మారుతోంది. ఏ అభివృద్ధి కార్యక్రమానికి సంబంధించి అయినా మేమంటే మేమే కారణమనే వైఖరి పార్టీలలో కనిపిస్తోంది. మొన్నటి గూగుల్ డేటా సెంటర్ మొదలుకుని.. నేటి కడప స్టీల్ ప్లాంట్ వరకూ పొలిటికల్ పార్టీలు ఈ" క్రెడిట్"ను తమకు అనుకూలంగా మార్చుకునే పనిలో ఉండగా.. ఆయా పార్టీల మద్దతుదారులు సోషల్ మీడియాలో వీటిని హోరెత్తిస్తున్నారు. వైఎస్సార్ కడప జిల్లాలో రాయలసీమ స్టీల్ ప్లాంట్ నిర్మాణ పనులు శుక్రవారం ప్రారంభమయ్యాయి. సీఎం చంద్రబాబు ఈ పనులను ప్రారంభించారు. ఈ సందర్భంగా మాట్లాడిన ఆయన.. రెండు దశాబ్దాల రాయలసీమ ప్రజల కల ఈరోజు నెరవేరిందన్నారు. సున్నపురాళ్లపల్లిలో జేఎస్‌డబ్ల్యూ రాయలసీమ స్టీల్ ప్లాంట్ పనులు ప్రారంభించి ఈ కలను నిజం చేశామని ప్రకటించారు. వైసీపీ ప్రభుత్వంలో కేవలం శంకుస్థాపనలతో సరిపెట్టి ప్రజలను మభ్యపెడితే... మేం పనులు మొదలుపెట్టి రాయలసీమ స్టీల్ ప్లాంటుకు వాస్తవరూపం ఇస్తున్నామని పనిలోపనిగా వైసీపీపైనా విమర్శలు చేశారు. 2028 నాటికి కడప స్టీల్ ప్లాంట్‌లో ఉత్పత్తి ప్రారంభిస్తామన్నారు చంద్రబాబు. కడపలో స్టీల్ ప్లాంట్ పనుల ప్రారంభంపై వైసీపీ అధినేత, మాజీ సీఎం వైఎస్ జగన్.. సజ్జన్ జిందాల్, జేఎస్ డబ్ల్యూ స్టీల్ బృందానికి అభినందనలు తెలిపారు. రాయలసీమ అభివృద్ధికి ఈ ప్రాజెక్టు కీలకమైన మైలురాయిగా జగన్ అభివర్ణించారు. యువతకు ఉపాధి అవకాశాలు లభిస్తాయని పేర్కొంటూ ట్వీట్ చేశారు. ఎన్నో ఏళ్ల కృషి, ప్రణాళిక అనే పునాదులపై ఇలాంటి ప్రతిష్టాత్మక ప్రాజెక్టులు నిర్మితమవుతాయన్న వైఎస్ జగన్.. వైసీపీ ప్రభుత్వ హయాంలోనే కడప స్టీల్ ప్లాంట్ ప్రాజెక్టుకు కీలకమైన పునాదులు వేశామన్నారు. పర్యావరణ అనుమతులు, నీటి కేటాయింపు, భూముల కేటాయింపు, రహదారుల అనుసంధానం వంటి మౌలిక సదుపాయాల కోసం భూమిని అందించామన్నారు. ఈ కారణాలతోనే ప్రాజెక్టు వేగంగా కదిలిందన్న జగన్.. కూటమి ప్రభుత్వం రెండేళ్లుగా

ఈ ప్రాజెక్టు పనులు నిలిపివేసిందని ఆరోపించారు. ఇప్పటికైనా పనులు ప్రారంభం కావటం సంతోషకరమంటూ జేఎస్‌డబ్ల్యూ యాజమాన్యానికి అభినందనలు తెలియజేశారు. మరోవైపు జగన్ చేసిన ట్వీట్‌కు సజ్జన్ జిందాల్ రిప్లై ఇచ్చారు." మీ శు భాకాంక్షలకు ధన్యవాదాలు, జగన్ గారు..మీ ప్రభుత్వ హయాంలో లభించిన ప్రారంభ అనుమతుల నుంచి నేటి ఈ ప్రారంభోత్సవం వరకు సాగిన ఈ ప్రయాణం నిరంతర కృషికి నిదర్శనం. ఈ ప్రాంత యువత, కుటుంబాల కోసం ఈ ప్రాజెక్ట్‌ను వేగంగా పూర్తి చేయడానికి మేము కట్టుబడి ఉన్నాము." అంటూ జిందాల్ ట్వీట్ చేశారు. సజ్జన్ జిందాల్ ట్వీట్ ఇప్పుడు సోషల్ మీడియాలో టీడీపీ వర్సెస్ వైసీపీగా మారుతోంది. వైసీపీ ప్రభుత్వ హయాంలో ఇచ్చిన అనుమతుల ద్వారానే కడప స్టీల్ ప్లాంట్ సాధ్యమైందని స్వయంగా జిందాల్ చెప్పారని వైసీపీ మద్దతుదారులు ట్వీట్లు చేస్తున్నారు. జగన్ హయాంలో వేగంగా ఇచ్చిన అనుమతులతోనే ఈ ప్రాజెక్టు కల సాకారమవుతోందని.. టీడీపీ ప్రభుత్వం క్రెడిట్ చోరీకి పాల్పడుతోందని విమర్శిస్తున్నారు. అయితే కడప స్టీల్ ప్లాంట్ నిర్మాణానికి కావాల్సిన నీరు, కరెంట్, రహదారులు వంటి మౌలిక వసతులు అభివృద్ధి చేసి.. పనులు ప్రారంభమయ్యేలా చేసింది చంద్రబాబు ప్రభుత్వమని టీడీపీ శ్రేణులు కౌంటరిస్తున్నాయి.

## బెంచ్‌పై కూర్చోబెట్టి విసిగించారు?.. అసంతృప్తిలో వైభవ్.. ఇన్‌స్టాగ్రామ్ స్టోరీతో కొత్త చర్చ!




**హైదరాబాద్ పెన్ పవర్:** ఇంగ్లాండ్‌తో జరగబోయే రెండో టీ20 మ్యాచ్‌కు ముందు 15 ఏళ్ల వండర్ కిడ్ వైభవ్ సూర్యవంశీ పెట్టిన ఒక ఇన్‌స్టాగ్రామ్ స్టోరీ ఇప్పుడు సోషల్ మీడియాలో విపరీతంగా హల్‌చల్ చేస్తోంది. ఐర్లాండ్, ఇంగ్లాండ్ పర్యటనలకు తొలిసారి ఇండియాకు ఎంపికైన వైభవ్.. వరుసగా మూడు మ్యాచ్‌ల్లో బెంచ్‌కే పరిమితమయ్యాడు. ఇక ఈరోజు మాంచెస్టర్‌లో జరగబోయే రెండో మ్యాచ్‌కు ముందు వైభవ్ తన ఇన్‌స్టాగ్రామ్ స్టోరీలో కొత్త అధ్యాయం అంటూ ఒక క్యాప్షన్‌ను జోడించాడు. దీంతో అతని నిరీక్షణ ముగిసిందని, ఈ మ్యాచ్‌తో అతను అంతర్జాతీయ క్రికెట్లోకి ఎంట్రీ ఇవ్వబోతున్నాడంటూ ఫ్యాన్స్ అనుకుంటున్నారు.

**ఇన్‌స్టా స్టోరీతో అరంగేట్రంపై క్లారిటీ:**

వైభవ్ ఇన్‌స్టాగ్రామ్ స్టోరీ అరంగేట్రంపై ఆశలు రేకెత్తిస్తున్నప్పటికీ.. మ్యాచ్‌కు ముందు జరిగిన ప్రెస్ కాన్ఫరెన్స్‌లో టీమిండియా బౌలింగ్ కోచ్ మోర్నీ మోర్కెల్ చేసిన వ్యాఖ్యలు మాత్రం అతడు మరికొంత కాలం వేచి చూడక తప్పదనే సంకేతాలు ఇచ్చాడు. ఇటీవల భారత్ గెలిచిన టీ20 ప్రపంచకప్‌లో అద్భుతంగా రాణించిన సీనియర్ ప్లేయర్స్ కు అండగా నిలవాల్సిన అవసరం ఉందని స్పష్టం చేశారు. కఠినమైన పరిస్థితుల్లో జట్టును గెలిపించిన ఆటగాళ్లను బ్యాక్ చేస్తూనే, ఇక్కడి కండిషన్స్‌కు తగ్గట్టుగా టాప్ ఆర్డర్‌ను పటిష్టం చేయడమే తమ ప్రస్తుత లక్ష్యమని మోర్కెల్ పేర్కొన్నారు.

**వరల్డ్ కప్ హీరోలకే మేనేజ్‌మెంట్ ఓటు:**

2026 టీ20 ప్రపంచకప్ టైటిల్ గెలవడంలో కీలక పాత్ర పోషించిన సంజు శాంసన్, అభిషేక్ శర్మల ఓపెనింగ్ జోడీనే రెండో టీ20లోనూ కొనసాగించేందుకు టీమ్ మేనేజ్‌మెంట్ ఇంట్రెస్ట్ చూపుతోంది.ద

గత మూడు మ్యాచ్‌ల్లో శాంసన్ కేవలం ఒకే ఒక్క పరుగు చేసి ఫామ్ కోల్పోయి ఇబ్బంది పడుతున్నప్పటికీ.. వరల్డ్ కప్ నాకౌట్ దశలో అతను ఆడిన వరుస మ్యాచ్ విన్నింగ్ ఇన్నింగ్స్‌ల ట్రాక్ రికార్డ్‌ను బట్టి కెప్టెన్ శ్రేయస్ అయ్యర్ అతనికి మరో ఛాన్స్ ఇవ్వాలని చూస్తున్నాడు. దీనివల్ల వైభవ్‌కు ఈ మ్యాచ్‌లోనూ నిరాశే ఎదురయ్యేలా కనిపిస్తోంది.

# సచిన్ రికార్డును బ్రేక్ చేసిన వైభవ్ సూర్యవంశీ.. 15 ఏళ్లకే భారత జట్టులో చోటు

**హైదరాబాద్ పెన్ పవర్:** భారత క్రికెట్ చరిత్రలో సరికొత్త అధ్యాయం స్టార్ట్ అయింది. బీహార్‌లోని సమస్తిపూర్ జిల్లాకు చెందిన 15 ఏళ్ల వండర్ కిడ్ వైభవ్ సూర్యవంశీ ఇంగ్లాండ్‌తో జరుగుతున్న రెండో టీ20 మ్యాచ్‌తో అంతర్జాతీయ క్రికెట్ అరంగేట్రం చేశాడు. ఈ మ్యాచ్‌తో వైభవ్ తన అద్భుతమైన ప్రయాణాన్ని మొదలు పెట్టడమే కాకుండా, భారత క్రికెట్ దిగ్గజం సచిన్ టెండూల్కర్ పేరిట దశాబ్దాలుగా ఉన్న అరుదైన రికార్డును బ్రేక్ చేసేశాడు.




**సచిన్ రికార్డు కనుమరుగు:**

వైభవ్ సూర్యవంశీ డెబ్యూతో భారత క్రికెట్ చరిత్ర పుస్తకాల్లో ఒక మార్పు చోటు చేసుకుంది. దశాబ్దాలుగా మాస్టర్ బ్లాస్టర్ సచిన్ టెండూల్కర్ రికార్డు ఇప్పుడు కనుమరుగైంది. ప్రస్తుతం వైభవ్ 15 సంవత్సరాల, 3 నెలల, 7 రోజుల వయస్సులో ఇంగ్లాండ్ గడ్డపై డెబ్యూ చేశాడు. ఇక సచిన్ టెండూల్కర్1989లో 16 సంవత్సరాల, 205 రోజుల వయసులో పాకిస్థాన్‌పై అరంగేట్రం చేశారు. కేవలం 15 ఏళ్ల ప్రాయంలోనే బ్లూ జెర్సీని ధరించి, ఇంటర్నేషనల్ క్రికెట్ లోకి అడుగుపెట్టిన వైభవ్, భారత పురుషుల క్రికెట్ జట్టు తరఫున ఆడిన అత్యంత పిన్న వయస్కుడైన ఆటగాడిగా 7(శీబఅస్త్రవర్ ×అఎఖుఅ జతీఅఎఎవ్వతీ) చరిత్ర పుటల్లో నిలిచాడు.

**ఐపీఎల్ నుంచి ఇంటర్నేషనల్ స్టేజీ వరకు:**

వైభవ్ సూర్యవంశీ ఈ స్థాయికి రావడానికి కారణం ఇటీవల ముగిసిన ఐపీఎల్ 2026లో అతను ప్రదర్శించిన అద్భుతమైన ఆటతీరు. రాజస్థాన్ రాయల్స్ తరఫున బరిలోకి దిగిన ఈ టీనేజర్, టోర్నీలోనే అత్యధిక పరుగులు చేసి ఆరెంజ్ క్యాప్ సొంతం చేసుకున్నాడు. అసాధారణ స్ట్రైక్ రేట్‌తో బౌలర్లను ముప్పుతిప్పలు పెట్టిన వైభవ్, భారత సెలెక్టర్ల దృష్టిని ఆకర్షించాడు. ఐర్లాండ్ పర్యటనలో ఛాన్స్ రాకపోయినా, ఇంగ్లాండ్‌తో జరిగిన మొదటి టీ20లో బెంచ్‌కే పరిమితమైనా.. వైభవ్ తన శ్రమతో ఈరోజు తుది జట్టులో స్థానం సంపాదించుకున్నాడు.

**ఫ్యూచర్ స్టార్ క్రికెటర్:**

15 ఏళ్ల వయసులోనే అంతర్జాతీయ క్రికెట్ ఒత్తిడిని ఎదుర్కొంటూ, దిగ్గజాల సరసన అరంగేట్రం చేయడం సాధారణ ముచ్చట కాదు. వైభవ్ సూర్యవంశీలోని ప్రతిభ, పోరాట పటిమ చూస్తుంటే, రాబోయే రోజుల్లో అతను భారత క్రికెట్‌లో మరెన్నో రికార్డులను సృష్టించడం ఖాయమని క్రీడా విశ్లేషకులు పేర్కొంటున్నారు. ఈ వండర్ కిడ్ అరంగేట్రంతో కోట్లాది మంది భారత అభిమానుల్లో కొత్త ఉత్సాహం నెలకొంది.

## వరల్డ్‌కప్‌లో అసలైన వార్ స్టార్ట్.. ఒక్కో మ్యాచ్ ఫైనల్‌లా.. రౌండ్ ఆఫ్ 16 పూర్తి షెడ్యూల్ ఇదే!

**హైదరాబాద్ పెన్ పవర్:** ఫిఫా ప్రపంచకప్ లో ఉత్కంఠభరితమైన రౌండ్ ఆఫ్ 32 మ్యాచ్‌లు ముగిశాయి. ఇప్పుడు అందరి దృష్టి రౌండ్ ఆఫ్ 16 పైకి మళ్లింది. ప్రపంచకప్ ట్రోఫీ రేసులో ప్రస్తుతం 16 జట్లు మిగిలి ఉన్నాయి. ఈ రౌండ్ ఆఫ్ 32లో నాలుగు సార్లు ఛాంపియన్‌గా నిలిచిన బలమైన జర్మనీని పరాగ్వే ఓడించడం, అలాగే నెదర్లాండ్స్‌పై మొరాకో పెనాల్టీ షూటౌట్‌లో విజయం సాధించడం ఈ టోర్నీలోనే హైలెట్‌గా నిలిచాయి. ఇకపై ట్రోఫీని ముద్దాడటానికి జట్లు కేవలం నాలుగు విజయాల దూరంలో మాత్రమే ఉన్నాయి.






పోర్చుగల్ వర్సెస్ స్పెయిన్: జూలై 7న జరగబోయే ఈ మ్యాచ్ కోసం ఫుట్‌బాల్ ప్రపంచం మొత్తం ఆసక్తిగా ఎదురు చూస్తోంది. పోర్చుగల్ ఇప్పటివరకు ఒక్క ప్రపంచకప్ కూడా గెలవలేదు. క్రిస్టియానో రొనాల్డోకు ఇది చివరి ప్రపంచకప్ అయ్యే అవకాశం ఉండటంతో, ఈ లెజెండ్ కోసం కప్పు గెలవాలని పోర్చుగల్ కసితో ఉంది. అయితే, ప్రస్తుత ఫామ్ ప్రకారం స్పెయిన్ హాట్ ఫేవరెట్‌గా బరిలోకి దిగుతోంది.

అర్జెంటీనా వర్సెస్ ఈజిప్ట్: డిఫెండింగ్ ఛాంపియన్ అయిన అర్జెంటీనా ఇప్పటి వరకు ఈ టోర్నీలో ఓటమి లేకుండా దూసుకుపోతోంది. రౌండ్ ఆఫ్ 32లో కేప్ వెర్డే జట్టు అర్జెంటీనాకు గట్టి పోటీ ఇచ్చినప్పటికీ, ఎలాగోలా బతికి బయటపడింది. ఇప్పుడు వారు మహ్మద్ సలాకు చెందిన ఈజిప్ట్ జట్టుతో తలపడనున్నారు.

ఇంగ్లాండ్ వర్సెస్ మెక్సికో: డీఆర్ కాంగోను ఓడించి ఇంగ్లాండ్, ఈక్వెడార్‌పై గెలిచి మెక్సికో ఈ రౌండ్‌కు క్వాలిఫై అయ్యాయి. 1966 తర్వాత రెండోసారి ప్రపంచకప్ గెలవాలని ఇంగ్లాండ్ చూస్తుండగా, మెక్సికో తన క్వార్టర్ ఫైనల్ రికార్డును (1970, 1986) తిరగరాయాలని భావిస్తోంది.

ఇతర మ్యాచ్‌లు: ఫ్రాన్స్ జట్టు పరాగ్వేతో, బ్రెజిల్ జట్టు ఎర్లింగ్ హాలాండ్‌కు చెందిన నార్వే జట్టుతో తలపడనున్నాయి.

# నేచురల్ గ్లామ్ ఓవర్‌లోడ్... అనంతికా లేటెస్ట్ ఫోటోలు ట్రెండింగ్!





సౌత్ ఫిల్మ్ ఇండస్ట్రీలో తన సహజమైన నటనతో, క్యూట్ లుక్స్‌తో సెన్సేషన్ క్రియేట్ చేస్తోంది యంగ్ బ్యూటీ అనంతికా శనిల్‌కుమార్. ఇటీవల తెలుగులో వచ్చిన '8 వసంతాలు' సినిమాతో పాటు తమిళ చిత్రం 'పరిమళ అండ్ కో'తో అందరి దృష్టిని ఆకర్షించిన ఈ కేరళ కుట్టి, తాజాగా ప్రకృతి ఒడిలో చేసిన ఒక ఫోటోషూట్ నెట్టింట బాగా ట్రెండ్ అవుతోంది. సాంప్రదాయ ఆలివ్ గ్రీన్ చీరలో, ఎలాంటి హంగామా లేని నేచురల్ గ్లామ్‌తో అనంతికా ఒలికించిన హావభావాలు కుర్రకారు మనసులను దోచుకుంటున్నాయి.

**ప్రకృతి ఒడిలో అనంతికా సొగసులు:**

ఈ సరికొత్త ఔట్‌డోర్ ఫోటోషూట్‌లో అనంతికా చుట్టూ పచ్చటి చెట్లు, ప్రకృతి అందాల మధ్య ఎంతో ఆహ్లాదకరంగా కనిపిస్తోంది. ఇక ఒక అందమైన దారిపై నడుస్తూ, పెదవులపై చెరగని చిరునవ్వుతో ఆమె ఇచ్చిన పోజులు చూసేవారికి ఫుల్ పాజిటివ్ వైబ్స్ ఇస్తున్నాయి. ఈ ఫోటోలలో ఆమె సింప్లిసిటీనే అందరికీ బాగా నచ్చేస్తోంది.

**ఆలివ్ గ్రీన్ చీరలో మోడ్రన్ టచ్:**

ఈ షూట్ కోసం అనంతికా ఎంచుకున్న డ్రెస్సింగ్ స్టైల్ చాలా సింపుల్‌గా, క్లాసీగా ఉంది. ఆమె కట్టుకున్న ఆలివ్ గ్రీన్ కలర్ హ్యాండ్లూమ్ లేదా బ్లాక్-ప్రింటెడ్ కాటన్ చీరపై ఉన్న చిన్న చిన్న ఎత్నిక్ డిజైన్లు చాలా బాగున్నాయి. ఇక దీనికి కాంబినేషన్‌గా వేసుకున్న ప్లెయిన్ బ్లాక్ స్లీవ్‌లెస్ బ్లౌజ్, డీప్ స్కూప్ నెక్ లైన్ ఆమె లుక్‌కి ఒక మోడ్రన్ టచ్ ఇచ్చింది.

**నో-మేకప్ లుక్.. మురిపిస్తున్న నవ్వు:**

ఈ ఫోటోషూట్‌కి అసలైన హైలైట్ ఏంటంటే, అనంతికా అసలు భారీ మేకప్ జోలికే వెళ్లలేదు. చాలా మినిమల్ మేకప్, సింపుల్ హెయిర్‌స్టైల్ మరియు ఎలాంటి భారీ ఆభరణాలు లేకుండా కేవలం చిన్న చిన్న జ్యువెలరీతోనే మెరిసిపోయింది. "అచ్చమైన పల్లెటూరి పిల్లను చూసినట్టు ఉందంటూ" నెటిజన్లు ఈ ఫోటోలకు హార్ట్ ఎమోజీలతో లైకుల వర్షం కురిపిస్తున్నారు.



**మలయాళం టు టాలీవుడ్ జర్నీ:**

మలయాళ సినిమాతో కెరీర్ స్టార్ట్ చేసిన అనంతికా శనిల్‌కుమార్, చాలా తక్కువ టైమ్‌లోనే సౌత్ మేకర్స్ దృష్టిలో పడింది. ఇక తన ఎక్స్‌ప్రెసివ్ కళ్లతో, సహజమైన యాక్టింగ్‌తో ప్రేక్షకులను కట్టిపడేస్తోంది. కథల ఎంపికలో వైవిధ్యం చూపిస్తూ, కేవలం గ్లామర్ పాత్రలకే పరిమితం కాకుండా నటనకు ప్రాధాన్యం ఉన్న రోల్స్ ఎంచుకుంటూ ఇండస్ట్రీలో ప్రామిసింగ్ హీరోయిన్‌గా ఎదుగుతోంది .సినిమాలతో ఎంత బిజీగా ఉన్నా, సోషల్ మీడియా ద్వారా అభిమానులకు ఎప్పుడూ టచ్‌లో ఉంటుంది అనంతికా. ప్రకృతిని ఎంతగానో ప్రేమించే ఈ బ్యూటీ, తన మనసుకు నచ్చిన లొకేషన్లలో ఇలాంటి క్యూట్ ఫోటోషూట్స్ చేస్తూ నెటిజన్లను సర్ప్రైజ్ చేస్తోంది. మరిన్ని వైవిధ్యమైన ప్రాజెక్టులతో ఈ యంగ్ అండ్ టాలెంటెడ్ హీరోయిన్ మున్ముందు మరెన్నో విజయాలు అందుకోవాలని ఆశిద్దాం..

*Printed By Published By Gantyada Apparao On Behalf Of Gantyada Apparao, Printed At Sri Sai Ganga Printers And Publishers, Flat No : 504, Bharat Towers, 5th Lane Dwarakanagar, Visakhapatnam, Andhra Pradesh - 530016, And Published At 1-17-1, Badeti Ramana Street, Near Mla House, 30th Word, Thadepalligudem , Editor Gantyada Apparao. PRGI Registration No. "APTEL/25/A2834, E-Mail : Editorpenpower@Gmail.Com, Mobile: 9059465965*